Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 95 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 ఏప్రిల్ 2023 గురువారం పేజీలు : 4

## జేడీఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్‌కు ఓటేసినట్టే: అమిత్‌షా

బాగల్‌కోట్: కర్ణాటక సర్వతోముఖాభివృద్ధికి, శాంతి, సుస్థిరత కోసం బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎన్నడు లేనంత అవినీతి చోటుచేసుకుంటుందని, బుజ్జగింపు రాజకీయాలు, కుటుంబ రాజకీయలు, అల్లర్లు చోటుచేసుకుంటా యని హెచ్చరించారు. జేడీఎస్‌కు ఓటు వేయడమంటే కాంగ్రెస్‌కు ఓటు వేయడమే అవుతుందని బాగల్‌కోట్ జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ అన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఇటీవల బీజేపీ నుంచి ఆ పార్టీలో చేరిన నేతలపై ఆధారపడి పోటీ చేస్తోందని, ఆ పార్టీలో నాయకత్వ లేమి ఉందనే విషయం దీనినిబట్టే స్పష్టమవుతోందని అమిత్‌షా అన్నారు. జేడీఎస్‌కు ఓటు వేస్తే కాంగ్రెస్‌కు ఓటు వేయడమే అవుతుందని చెప్పారు.




# అర్బన్ 'జై' కొడుతోంది! రూరల్ వ్యతిరేకిస్తోందా!?

## కేసీఆర్‌కు 'ముచ్చటగా మూడోసారి' సాధ్యమేనా!?

హైదరాబాద్ : బీయారెస్ రెండు సార్లు వరసబెట్టి గెలిచింది. ఈ ఫీట్ ని ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీలు కూడా చేశాయి. కానీ మూడవసారి గెలవడం మాత్రం 1983 తరువాత ఎపుడూ జరిగింది. తెలుగుదేశం పెట్టకముందు ఏకైక పార్టీగా కాంగ్రెస్ ఉంది కాబట్టి జనాలు కూడా ఆ పార్టీని గెలిపిస్తూ వచ్చారు. 1983లో తెలుగుదేశం వచ్చాక పోటా పోటీ రాజకీయ వాతావరణం ఏర్పడింది. మరో వైపు చూస్తే 2014 తరువాత ఉమ్మడి ఏపీ రెండుగా విడిపోయింది. ఏపీలో చూస్తే తెలుగుదేశం అయిదేళ్ల పాలనతో వెనక్కి వెళ్ళింది. ఆ ప్లేస్ లోకి వైసీపీకి వచ్చింది. అంటే ఏపీ జనాలు మరో ఆప్షన్ని రెండవ ఎన్నికకే ఎంచుకున్నారు. ఇపుడు కూడా ఏపీలో రాజకీయ మార్పునకు అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అదే తెలంగాణాలో చూసుకుంటే మాత్రం బీయారెస్ రెండు సార్లుగా గెలుస్తూ వస్తోంది. మూడవసారి కూడా గెలవాలని అనుకుంటోంది. కానీ అది సాధ్యమేనా అంటే విపక్షంలో కొంత చీలిక ఉంది. అటు బీజేపీ ఇటు కాంగ్రెస్ సైతం వేరుగా పోటీ చేస్తున్నాయి. ఈ రెండు జాతీయ పార్టీలు. ఈ రెండు అసలు కలలో కూడా కలిసే అవకాశాలు లేవు. అదే బీయారెస్ కి వరంగా మారుతుందా అన్న చర్చ అయితే ఉంది. అదే సమయంలో చూసుకుంటే బీయారెస్ కి ఈ ఏడాది చివరలో జరిగే ఎన్నికలు క్యాట్ వాక్ కానే కావని అంటున్నారు. రెండు సార్లు అధికారంలో ఉండడం వల్ల వ్యతిరేకత ఎక్కువగానే ఉంది అని అంటున్నారు. అయితే అది ఏ స్థాయిలో ఉంది ఏఏ సెగ్మెంటలో ఉంది అంటే బీయారెస్ కి అర్బన్ ఏరియాల్లో కొంత సానుకూలత ఉంటే విలెజ్ లెవెల్ లో మాత్రం పూర్తి వ్యతిరేకత ఉంది అని అంటున్నారు. నిజంగా చూస్తే ఈ రకమైన విశ్లేషణ చిత్రంగానే ఉంది. ఎందుకంటే బీయారెస్ ఉద్యమ పార్టీ. పక్కా మాస్ పార్టీ. మాస్ డైలాగులు పేల్చుతూనే కేసీయార్ ఉద్యమాన్ని రాజకీయాన్ని సమాంతరంగా నడిపించారు. అలాంటిది బీయారెస్ విషయం తీసుకుంటే బలం అంతా విలేజ్ లలోనే ఉండాలి కదా అన్నది ఒక రకమైన అంచనా. పైగా బీయారెస్ పథకాలు కూడా ఎక్కువగా అక్కడే అమలు చేస్తూ వస్తోంది. కానీ అలా కాదు అన్నదే ఒక విశ్లేషణ. అర్బన్ జనాలలోనే బీయారెస్ కి అనుకూలత ఉందిట.

లేటెస్ట్ గా వస్తున్న కొన్ని సర్వేలు చూస్తే హైదరాబాద్ లోని ఓటర్లు అంతా బీయారెస్ మీద అభిమానాన్ని బాగా పెంచుకుంటున్నారు అని అంటున్నారు. దానికి కారణం బీయారెస్ ఏలుబడిలో హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం బాగా విస్తరించింది. దాంతో ఆ రంగంలో ఉన్న వారికి మంచి లాభాలు వస్తున్నాయట. దాంతో పాటు రాజధాని నగరంలో జాబ్ క్రియేషన్ కూడా చాలా బాగా ఉంది అని అంటున్నారు. అంతే కాదు ఎటు చూసినా ఫ్లై ఒవర్స్ వచ్చాయి. హైదరాబాద్ సిటీలో బ్రహ్మాండమైన సచివాలయం నిర్మించారు. సిటీని ఇంటర్నేషనల్ లెవెల్ లో తీర్చిదిద్దారు. దాంతో మునుపటికి నేటికీ తేడాను అక్కడ జనాలు చూస్తూ బీయారెస్ పాలన మీద సానుకూలంగా స్పందిస్తున్నారు అని అంటున్నారు. దీనికి విరుద్ధంగా విలేజిలలో మాత్రం పెద ఎత్తున బీయారెస్ పార్టీ పట్ల వ్యతిరేకత ఉంది అని అంటున్నారు. పైగా అక్కడ బీయారెస్ ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందిట. అది బీయారెస్ మీద కూడా గట్టిగానే పడుతోంది. అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే కాంగ్రెస్ లో పక్కా మాస్ లీడర్ గా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి తయారు కావడం వల్ల కూడా రూరల్ సెక్టార్ లో బీయారెస్ బాగా వెనకబడడానికి కారణం అవుతోంది అని అంటున్నారు. ఇంకో వైపు బీజేపీ కూడా తన సత్తా చాటుకోవడానికి చూస్తోంది. బీయారెస్ ఎక్కడ బలంగా ఉందో చూసి మరీ గురి పెట్టి ఆ ప్రాంతాలలో విస్తరించేందుకు చూస్తోంది.

దాంతో అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ ఈ రెండు పార్టీలు గ్రామీణ ప్రాంతాల మీద ఫుల్ గా ఫోకస్ పెట్టడంతో బీయారెస్ కి రూరల్ ఏరియాల్లో వ్యతిరేకత కనిపిస్తోంది అని అంటున్నారు. సహజంగా చూస్తే రూరల్ ఏరియాల్లోనే ఓట్లు ఎక్కువగా ఉంటాయి. అర్బన్ ఓటింగ్ తో పోలిస్తే గెలుపునకు అవసరం అయ్యేది రూరల్ ఓటింగే. దాంతో బీయారెస్ పల్లెలను దగ్గరకు తీసుకోకపోతే మాత్రం ఇబ్బంది అవుతుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## తెలంగాణలో మరో రెండు రోజులు వర్షాలు..!



హైదరాబాద్ : రాష్ట్రంలో మరో రెండు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం నుంచి శుక్రవారం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, వడగళ్లతో వర్షం కురిసే అవకాశం ఉంది పేర్కొంది.

ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. ఇవాళ ఉదయం 8.30 గంటల వరకు రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిశాయి. మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం..



### మందుపాతర పేలి 11 మంది జవాన్లు మృతి

ఛత్తీస్‌గఢ్ : పోలీసులు యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్ ముగించుకుని వస్తున్న క్రమంలో మావోలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. జవాన్లతో వెళ్తున్న మినీ బస్సును టార్గెట్ చేసి ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్‌ని పేల్చినట్లుగా అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో దాదాపు 10 మంది జవాన్లతోపాటు ఒక డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు. మృతులు డిఫెన్స్ రీసెర్చ్‌కు చెందినవారిగా గుర్తించారు.

మరోవైపు ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బగేల్ స్పందించారు. జవాన్ల మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'ఈ ఘటన గురించి సమాచారం అందింది. ఇలా జరగటం చాలా బాధాకరం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మావోయిస్టులపై మా యుద్ధం కొనసాగుతుంది. వాళ్లను వదిలే ప్రసక్తే లేదు' అని అన్నారు.



# కన్నడ నాట షాకులిస్తున్న సర్వేలు

బెంగళూరు/మంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, కర్ణాటక కింగ్ మేకర్ ఎవరు ?, కర్ణాటకకు కాబోయే సీఎం ఎవరు అంటూ ఇప్పటికే జోరుగా చర్చ జరుగుతోంది. పలు మీడియా సంస్థలు. పలు సంస్థల సర్వేలల్లో షాకింగ్ విషయాలు బయటకు వస్తుండటంతో పలు పార్టీల నాయకులు టెన్షన్ తో హడలిపోతున్నారు. భర్తను వదిలేసి కొత్త ఇంట్లో కాపురం పెట్టిన భార్య, ఆంటీని నరికి చంపేసిన అంకుల్ ! తాజాగా టీవీ 9- సీ ఓటర్స్ సర్వేతో కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఉలిక్కిపడ్డారు. టీవీ 9, సీ- ఓటర్స్ సర్వే విడుదల అయ్యింది. ఇంతకాలం కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ నాయులు ఈ సర్వే ఫలితాలు చూసి కొందరు షాక్ కావడంతో మరి కొందరు నాయకులు లైట్ గా తీసుకుంటున్నారు. గతంలో చాలా ఏళ్ల పాటు కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం కొనసాగుతోంది. సిద్దరామయ్య ఐదు సంవత్సరాలు పూర్తి కాలం సీఎంగా ఉన్నారు. సిద్దరామయ్య సీఎం కాకముందు. ఆయన సీఎం పదవి నుంచి దిగిపోయిన తరువాత కూడా కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వాలే కొనసాగాయి. బీజేపీ. కాంగ్రెస్ పార్టీలు పూర్తి మెజారిటీతో ప్రభుత్వాలు ఏర్పాటు చెయ్యలేకపోయాయి. మాజీ సీఎంకు షాక్, రివర్స్ ఆపరేషన్ షురు, దెబ్బకు దెబ్బ తియ్యాలి, కులం ఓట్లతో !

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు విజయం సాధిస్తారు అంటూ టీవీ 9, సీ- ఓటర్స్ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో దిమ్మతిరిగిపోయే విషయాలు బయటకు వచ్చాయి. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ కు 106 నుంచి 116 సీట్లు వస్తాయని, బీజేపీకి 70 నుంచి 89 సీట్లు వస్తాయని టీవీ 9, సీ ఓటర్స్ సర్వేలో వెలుగు చూడటం ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. చాలా సంవత్సరాల నుంచి కర్ణాటకలో కింగ్ మేకర్ గా వ్యవహరిస్తూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సొంతం చేసుకున్న జేడీఎస్ పార్టీ నాయకుడు హెచ్.డీ. కుమారస్వామి పార్టీకి ఈ ఎన్నికల్లో కేవలం 23 నుంచి 34 సీట్లు మాత్రమే వస్తాయని, గతంలో కంటే జేడీఎస్ పార్టీ చాలా సీట్లు కోల్పోతుందని సర్వేలో వెలుగు చూసింది. ఇక ఇతర పార్టీలకు చెందిన సుమారు ఐదు మంది విజయం సాధించే అవకాశం ఉందని సర్వేలో వెలుగు చూసింది.

## సంపాదకీయం

### 40 శాతం కమీషన్లపై '4 శాతం రిజర్వేషన్ల' ప్రభావం ఎంత?

కర్ణాటక ఎన్నికల్లో ఎటు చూసినా.. 4 శాతం రిజర్వేషన్ల అంశం.. ప్రధానంగా చర్చకు వస్తోంది. ముస్లిం సామాజిక వర్గాలకు కాంగ్రెస్ హయాంలో ప్రకటించి అమలు చేసిన 4 శాతం రిజర్వేషన్ను ఇటీవల ఎన్నికలకు ముందు.. బీజేపీ ప్రభుత్వం రద్దు చేసింది. నిజానికి రద్దు చేయాలని అనుకుంటే.. అధికారం లోకి వచ్చిన 2019లోనే రద్దు చేసి ఉండాల్సింది. కానీ అలా చేయకుండా.. రాజకీయ ఆనుపానులు గుర్తిం చి బీజేపీ అడుగులు వేసింది. ఈ క్రమంలో ఈ 4 శాతం రిజర్వేషన్ను కీలకమైన సామాజిక వర్గాలు వక్కలిగ లింగాయత్లకు.. బీజేపీ కట్టబెట్టింది. ఇది ఇప్పుడు ఎన్నికల వ్యూహాలను.. ఎన్నికల పరిస్థితిని కూడా సమూలంగా మార్చేస్తుందని కమలనాథుల లెక్కలుచెబుతున్నాయి. నిజానికి బీజేపీ పాలిత కర్నాటకలో కొన్నాళ్లుగా 40 శాతం కమీషన్ వ్యవహారం తారస్థాయికి చేరుకుంది. తమ పనులకు ప్రభుత్వ పెద్దలు.. మంత్రులు కూడా 40 శాతం కమీషన్ అడుగుతున్నారంటూ. ఒక కాంట్రాక్టర్ ఏకంగా ఆత్మహత్య చేసుకున్నారు. మరికొందరు కాంట్రాక్టర్లు కూడా ఇదే చెప్పి..పనులు చేయలేమని చేతులు ఎత్తేశారు. ఇక ఎన్నికలకు నెల రోజుల ముందు కోటిన్నర రూపాయల కమీషన్ను నెట్ క్యాష్ రూపంలో అందుకుని ఎమ్మెల్యే(బీజేపీ) కుమారుడు అడ్డంగా దొరికిపోయాడు. ఈ పరిణామాలతో ప్రజల్లో బీజేపీపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందనే అంచనాలు వచ్చాయి. ఈ సమయంలో అనూహ్యంగా రిజర్వేషన్ అంశాన్ని తెరమీదికి తెచ్చిన బీజేపీ ముస్లింలకు 4 శాతం రద్దు చేసి.. దానిని వక్కలిగలకు లింగాయత్లకు పంచేసింది. ఇది ఎన్నికల్లో తమకు లాభిస్తుందని కమల నాథులు ఆశలు పెట్టుకున్నారు. అయితే.. అవినీతిని సహిం చని కర్ణాటక ప్రజలు.. 40 శాతం కమీషన్పైనే కాకుండా.. కార్యాలయాల్లో అధికారులు లంచావతారులుగా మారుతున్నారంటూ.. తాజాగా బెంగళూరులో బోర్డులు పెట్టారు. ఆఫీసుల్లో లంచాలను అరికట్టే వారికే తమ ఓటు అంటూ.. బెంగళూరు వాసులు ముక్తకంఠంతో చాటుతున్నారు. అంటే.. ఒక రెండు సామాజిక వర్గాలకు సానుకూలంగా నిర్ణయం తీసుకున్నా.. రాష్ట్ర వ్యాప్తంగా అట్టుడుకుతున్న లంచాల వ్యవహారం .. సమసిపోయేలా లేదని.. పరిశీలకులు చెబుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# పోటీ పడలేరు



నిజామాబాద్ : రాష్ట్రంలో 80 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది. పోటీ పరీక్షల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభ్యర్థులు గ్రంథాలయాల బాట పట్టారు. ఉత్తమ ఫలితాలు అందుకొని లక్ష్యాన్ని చేరుకునేందుకు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. అన్ని పఠనాలయాల్లో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల్లో ప్రధాన సమస్యలు, అందుబాటులో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు, అభ్యర్థులు కోరుతున్న ఇతర అంశాలపై పరిశీలన కథనం.

నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని అరువిచ్చే విభాగంలో 7012 మంది సభ్యత్వం తీసుకున్నారు. విచారణ విభాగంతో పాటు మరో నాలుగు గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో కేవలం 350 కుర్చీలు మాత్రమే ఉన్నాయి. ఉదయం నుంచే కుర్చీల కోసం పోటీ నెలకొంటుంది. అట్టలు సరిపడా లేవు. వందల సంఖ్యలో తరలొస్తున్న విద్యార్థులు, పాఠకుల కోసం గదులు సరిపోవట్లేదు. 200 మంది కూర్చునేలా రెండు విశాలమైన గదులు కావాలని అభ్యర్థులు కోరుతున్నారు. 53కి గాను 21 మంది సిబ్బందే ఉన్నారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి. ప్రతి శుక్రవారం మహిళా విభాగాన్ని తెరిచి ఉంచాలి. విద్యుత్తు అంతరాయం లేకుండా ఉండేందుకు జనరేటర్ సౌకర్యం కల్పించాలి.

**రూ. 10 లక్షలతో పుస్తకాల కొనుగోలు**

రోజు వందల మంది పాఠకులు వస్తుండటంతో గదులు సరిపోవట్లేదు. కొత్తగా గదుల నిర్మాణం కోసం స్థలాన్ని సేకరించాలని కలెక్టర్‌కు విన్నవించాం. ఇందుకోసం తగినన్ని నిధులు కేటాయించాం. రూ.10 లక్షలతో ఆన్ డిమాండ్ పుస్తకాలను దశల వారీగా కొనుగోలు చేయనున్నాం. జిల్లా వ్యాప్తంగా ఏడు శాఖ గ్రంథాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నాం. సిబ్బంది కొరత కూడా పరిష్కారం కానుంది. ఎమ్మెల్సీ కవిత సహకారంతో మధ్యాహ్నభోజనం కొనసాగుతోంది. ఇటీవల 300 కుర్చీలు కొనుగోలు చేశాం.

– ఆరుట్ల రాజేశ్వర్, నిజామాబాద్ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్

కామారెడ్డిలో 3580 మంది సభ్యత్వం తీసుకున్నారు. ఐదు గదులు ఉన్నాయి. ఇందులో 500 మంది వరకు చదువుకోవడానికి అవకాశం ఉంది. కంప్యూటర్ విభాగాన్ని విస్తరించాలి. పూర్తిస్థాయిలో డిజిటల్ గ్రంథాలయంగా మార్చాల్సిన అవసరం ఉంది. 32కు గానూ 12 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి.

ఆర్మూర్ గ్రంథాలయ పరిసరాల్లో పాములు సంచరిస్తున్నాయి. మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్డి లేదు. విశాలమైన గదితో పాటు కంప్యూటర్ విభాగం నెలకొల్పాలి. 2 బోధన్ పఠనాలయంలో మూడు గదులు ఉన్నా అవసరమైన కుర్చీలు లేవు. అంతర్జాలం అందుబాటులో లేదు. 2 బాన్సువాడలో పాత భవనంలోనే కొనసాగుతుండటంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.20 లక్షలతో కొత్త భవనం నిర్మిస్తామంటున్నా ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. రెండు గదులున్నాయి.

**దాతల సహకారం తీసుకుంటాం**

జిల్లాగా ఏర్పడిన తర్వాత నూతన భవనం నిర్మించాం. ఇటీవల రూ.2.50 లక్షలతో పోటీ పరీక్షల కోసం సరిపడా పుస్తకాలు కొన్నాం. పాఠకుల కోసం త్వరలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించనున్నాం. దాతల సహకారం తీసుకుంటున్నాం. డిజిటలైజేషన్ కోసం ప్రయత్నిస్తున్నాం. బాన్సువాడలో రూ.20 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించనున్నాం.

– పొన్న రాజేశ్వర్, కామారెడ్డి గ్రంథాలయ సంస్థ ఛైర్మన్

**ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి**

రెండేళ్లుగా గ్రూప్స్ కోసం చదువుతున్నా. జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉదయం ఏడు గంటల్లోగా వస్తేనే కుర్చీలు దొరుకుతున్నాయి. విభాగాన్ని విస్తరించి కుర్చీలు పెంచాలి. మహిళల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి. కొత్త పాఠ్యప్రణాళిక ప్రకారం పుస్తకాలు తెప్పించాలి. – అపర్ణ, నిజామాబాద్

# ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దుపై ముగిసిన వాదనలు.. తీర్పు వాయిదా

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ1 నిందితుడు ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను ప్రభావితం చేయడంతో పాటు విచారణకు సహకరించడం లేదని సీబీఐ తరపు న్యాయవాదులు తెలిపారు. గంగిరెడ్డి సాక్ష్యులను ప్రభావితం చేయడంలేదని గంగిరెడ్డి తరపు న్యాయవాదులు వాదించారు. ఇరువర్గాల వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు రేపటి(గురువారం)కి వాయిదా వేసింది. వివేకా హత్య కేసులో ఏ1గా ఉన్న ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ వేసింది. గత రెండు నెలలుగా ఈ పిటిషన్‌పై వాదనలు కొనసాగాయి. ఈరోజు కూడా బెయిల్ రద్దు పిటిషన్‌పై వాదనలు జరుగగా తీర్పును హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. ఎర్రగంగిరెడ్డి బయట ఉండటం సమంజసం కాదని, సాక్ష్యులను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారని, అలాగే సాక్ష్యులను బెదిరించే ప్రయత్నాలు చేస్తున్నారని అలాగే సాక్షాలను తారుమారు చేస్తున్నారని సీబీఐ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. అయితే ఎర్రగంగిరెడ్డి ఎక్కడా కూడా సాక్ష్యులను ప్రభావితం చేయలేదని ఎర్రగంగిరెడ్డి తరపు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ఎర్రగంగిరెడ్డి బెయిల్ నిబంధనలు విస్మరించకుండా.. నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటున్నారని తెలిపారు. సీబీఐ అధికారులు పిలిచిన ప్రతీసారి ఎర్రగంగిరెడ్డి విచారణకు హాజరయ్యారని, 72 సార్లు సీబీఐ ఎదుట హాజరయ్యారని కోర్టుకు చెప్పారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు.. గురువారం తుది తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. గతంలో ఎర్రగంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని ఏపీ హైకోర్టును సీబీఐ ఆశ్రయించగా.. న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టు తీర్పుపై సీబీఐ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. అయితే అప్పటికే వివేకా కేసు తెలంగాణకు బదిలీ అయిన నేపథ్యంలో హైకోర్టులో తేల్చుకోవాలని సుప్రీం సూచించింది. ఈ మేరకు ఎర్రగంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలంటూ సీబీఐ... తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈరోజు హైకోర్టులో వాదనలు ముగియగా.. తీర్పు రేపటికి వాయిదా పడింది. ఈ క్రమంలో ఎర్రగంగిరెడ్డి బెయిల్ రద్దుపై తెలంగాణ హైకోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వబోతుందనే ఉత్కంఠ నెలకొంది.



**కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ మైసూరులో పేరొందిన మైలారి రెస్టారెంట్‌లో అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి చిన్నారులతో సరదాగా ముచ్చటించారు.**

# ఓటరు చైతన్య పోటీలు



కామారెడ్డి : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా గొప్పది. ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం కల్పించిన బ్రహ్మాస్త్రం. స్థానిక సంస్థలు మొదలుకొని పార్లమెంట్ ప్రతినిధుల ఎన్నిక వరకు చాలా కీలకం.

అందుకే ఓటరు చైతన్యమే లక్ష్యంగా ఎన్నికల సంఘం అడుగులు వేస్తోంది.తాజాగా సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్(స్వీప్) ద్వారా ప్రజల్లో దాగి ఉన్న సృజనాత్మక, కళాత్మక విలువలను వెలికితీయడానికి 'నా ఓటు.. నా భవిష్యత్తు.. ఓటుకు ఉన్న శక్తి' అనే అంశాలపై జాతీయస్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. భారత ఎన్నికల సంఘం ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తోంది. అన్ని వయసుల వారికి అవకాశం కల్పిస్తోంది. విజేతలకు రూ.5 వేల నుంచి రూ.2 లక్షల వరకు నగదు పురస్కారంతో సత్కరించనుంది.

ఆన్‌లైన్ వేదికగా ఈ పోటీలు ఉంటాయి. ఈ నెల 15 వరకు అవకాశం ఉంది. పూర్తి వివరాలకుఓటరు చైతన్య పోటీలు ను సందర్శించాలి.

లి క్విజ్: ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఎన్నికల చట్టాలు, ఐటీ అప్లికేషన్లు, భారతీయ ఎన్నికల చరిత్ర అంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. మూడుస్థాయిల్లో ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన వారికి ఈ-సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

లి పాటలు: మూడు నిమిషాల నిడివిలో పాడాల్సి ఉంటుంది. కళాకారులు, గాయకులు తమకు నచ్చిన వాయిద్య పరికరాలను ఎంచుకుని పాడొచ్చు. ఇన్‌స్టిట్యూషనల్, ప్రొఫెషనల్, ఎమాచ్యూర్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రశంసా బహుమతులు అందజేస్తారు. రూ.3 వేల నుంచి రూ.లక్ష వరకు నగదు పురస్కారం ఉంటుంది.

గోడపత్రిక: ఓటు ప్రాధాన్యం తెలిపేలా.. సాధారణ ప్రజలకు అర్థం అయ్యేలా సందేశాత్మక గోడపత్రిక తీర్చిదిద్దాలి. వివిధ రకాల రంగులు ఉపయోగించడంతో పాటు మేథస్సుకు పదును పెట్టాలి. రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు నగదు బహుమతి ఉంటుంది.

లి నినాదాలు: ఓటరును చైతన్యం చేయడంలో నినాదాల పాత్ర చాలా ముఖ్యం. ఆకట్టుకునే నినాదాలు రూపొందించి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ రూ.7500, ప్రోత్సాహకం కింద ఎంపిక చేయబడిన 50 మందికి రూ.2 వేల చొప్పున అందజేస్తారు.

లి వీడియో చిత్రీకరణ: భారతీయ ఎన్నికల వైభవం-విస్తృతి అనే అంశంపై సృజనాత్మకంగా వీడియో చిత్రీకరణ చేయాల్సి ఉంటుంది. ఓటు గొప్పదనం తెలిసేటట్టుగా, ప్రలోభాలకు లొంగకుండా నిస్వార్థంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా చిత్రీకరించాలి. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, మొదటిసారి ఓటు వేస్తున్న వారితో కలిసి లఘుచిత్రాలు నిర్మించాలి. రూ.5 వేల నుంచి రూ.2 లక్షల వరకు నగదు పురస్కారం ఉంటుంది.

# కాల్వ విస్తరణ జరిగేనా?

నిజామాబాద్ : గోదావరి జలాల తరలింపులో కీలకమైన నిజాంసాగర్ కాల్వ విస్తరణకు అడుగులు పడట్లేదు. మరోవైపు 20వ ప్యాకేజీ పంపుహౌస్ పనులు తుది దశకు చేరాయి. త్వరలోనే వెట్‌రన్ నిర్వహించే అవకాశం ఉంది. దీంతో ప్రతిపాదించిన మేరకు నీటి తరలింపు ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సారంగపూర్ నుంచి మాసాని చెరువు వరకు ఆక్రమణలు జరగడం సమస్యకు కారణంగా మారింది.

బఫర్ జోన్‌లో నిర్మాణాలు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో కాళేశ్వరం 20, 21, 21ఏ ప్యాకేజీ పనులు చేపట్టారు. ఇందులో ప్యాకేజీ-20లో 30 మెగావాట్ల సామర్థ్యం గల మూడు మోటార్లతో పంపుహౌస్ నిర్మించారు. తొలుత ఇక్కడి నుంచే నీటిని ఎత్తిపోస్తారు. మూడు పంపుల ద్వారా రోజుకు 70 క్యూసెక్కుల నీటిని తరలించాలని ప్రతిపాదించారు. ఇందుకు ప్రస్తుతం ఉన్న 17 మీటర్ల వెడల్పు గల కాల్వ విస్తీర్ణం సరిపోదు. దీన్ని 29.5 మీటర్ల వెడల్పునకు విస్తరించాలని నిర్ణయించారు. కాగా ప్రధాన కాల్వ మధ్య నుంచి ఇరువైపులా 240 అడుగులు, ఉప కాల్వలకు 35 అడుగుల చొప్పున బఫర్ జోన్‌గా కొనసాగించాలి. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి ఇవ్వకూడదు. కానీ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేక వందలాది నిర్మాణాలు వెలిశాయి. కాల్వ కట్టను ఆనుకొని ఇళ్లు నిర్మించుకోవడంతో అడ్డంకులు ఎదురవుతున్నాయి.

మూడు పంపులతో..నవీపేట మండలం బినోల సమీపంలో భూగర్భ టన్నెల్ నుంచి సారంగపూర్ సర్జిపుల్ పంపుహౌస్‌లోకి నీరు చేరుతోంది. ఇక్కడ పంపులు నడిపించి నిజాంసాగర్ కాల్వ ద్వారా మాసాని, మంచిప్ప చెరువులకు తరలిస్తారు. మెంట్రాజ్‌పల్లికి సైతం నీటి తరలింపు ఇలాగే ఉంటుంది. ఆ పంపుహౌస్ కూడా పూర్తయిన క్రమంలో వెట్‌రన్‌కు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పైపులైన్ల ద్వారా ఆర్మూర్, బాల్కొండ, మెట్‌పల్లి ప్రాంతాలకు నీటిని తరలించనున్నారు. ఇప్పటికే ప్రధాన పైపులైన్ పనులు 90 శాతం పూర్తయ్యాయి. మెంట్రాజ్‌పల్లి పంపుహౌస్ నుంచి జక్రాన్‌పల్లిలో 14 వేలు, వేల్పూరులో 6 వేలు, మాక్లూర్‌లోని 20 వేల ఎకరాలకు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. తొలుత ఒకే పంపు నడిపి, విస్తరణ పూర్తయ్యాక మూడు పంపులు నడిపించాలని ఆలోచిస్తున్నారు.

సమస్య జఠిలం..సారంగపూర్ నుంచి మాసాని చెరువు వరకు 8.7 కిలోమీటర్ల కాల్వ ఉంది. కొంత దూరం వరకు విస్తరణ చేపట్టారు. 3.2 కిమీ పరిధిలో ఆక్రమణలు ఉండటంతో పనులు ఆపేశారు. ఇది తమ స్థలమంటూ జలవనరులశాఖ నివాసితులకు నోటీసులిచ్చింది. అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నామని వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

# క్షేత్రస్థాయి సందర్శన అత్యంత కీలకం

ఖమ్మం : శిక్షణ కాలంలో క్షేత్రస్థాయి సందర్శన అత్యంత కీలకమని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అన్నారు. ఆలిండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు శిక్షణలో భాగంగా పోలీసు కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించారు. వారికి అదనపు డీసీపీ గౌష్ ఆలమ్ స్వాగతం పలికారు. అనంతరం సీపీతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖలో నిత్యం జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలను కాగిత రహిత విధానంలోకి తీసుకవచ్చేందుకు ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.



వ్యక్తిగత రుణాలు, సెలవులు, భద్రతస్కీమ్, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాలు, ఎల్ఐసీలు, జీపీఎస్ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. శిక్షణ అధికారులు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజల జీవన విధానం, వ్యవసాయం, నీటి వసతి, విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత అభివృద్ధి, యువతకు ఉపాధి తదితర అంశాలను అధ్యయనం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత పథకాల అమలు తీరు, పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు పరిశీలించామని తెలిపారు.

# అప్రమత్తతతోనే అడ్డుకట్ట

కరీంనగర్ : ఆందోళన చెందకుండా ఆలోచనతో అగ్నిప్రమాదాలను అరికట్టవచ్చని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల మెట్‌పల్లి డివిజన్ కేంద్ర అగ్నిమాపకశాఖ పరిధిలోని ఆసుపత్రులు, కళాశాలలు, పాఠశాలలు, వర్తక దుకాణాలు, ఆర్టీసీ బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లతో పాటు వివిధ చోట్ల అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో పాటు ప్రత్యేక ప్రదర్శనలు, కరపత్రాలు, గోడప్రతుల ఆవిష్కరణలు చేస్తూ అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో ఉపయోగించే పరికరాలను అధికారులు వివరించారు.

బ్రీతింగ్ ఆపరేటివ్(బీఏ): ఈ పరికరాన్ని విష వాయువులతో పాటు ఫ్యాక్టరీలలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో అగ్నిమాపక సిబ్బంది లోనికి వెళ్లలేని పరిస్థితిలో ధరించి లోనికి వెళ్తారు. సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చి, మంటల్లో చిక్కుకున్న వారిని కూడా కాపాడేందుకు వినియోగిస్తారు. నిప్పు ఆర్పేందుకు: లండన్ హైండ్ కంట్రోల్, మల్టీపర్పస్ నాజిల్, రివాల్వింగ్ నాజిల్, ఫోం బ్రాంచ్‌లుగా పిలువబడే ఈ పరికరాలు అగ్నిప్రమాదాలను నివారించేందుకు, మండుతున్న వాటిపై నీటిని చల్లి తొందరగా అరికట్టేలా వీటిని వినియోగిస్తారు.

హైడ్రాలిక్ కట్టర్: ఈ పరికరాన్ని రోడ్డు ప్రమాదాల్లో రెండు వాహనాలు ఢీకొన్న సమయంలో వాటిని విడదీసేందుకు, దుకాణాలు, బ్యాంకుల్లో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో డోర్‌లాక్ అయితే తొలగించి



లోనికి వెళ్లి అగ్నిప్రమాదాలను నివారించేలా వీటిని ఉపయోగిస్తారు.

మిస్ట్ బుల్లెట్: ఈ మిస్ట్‌బుల్లెట్ వాహనాన్ని చాలాచోట్ల, ముఖ్యంగా ప్రముఖులు వచ్చిన సమయంలో తప్పకుండా వినియోగిస్తారు. అగ్నిమాపక వాహనం లోనికి వెళ్లలేని పరిస్థితిలో ముందుగా దీనిని పంపించి మంటలను అదుపులోకి తెస్తారు. ఈ వాహనంపై ఇద్దరు వెళ్లేందుకు అవకాశం ఉంది.

లైఫ్ జాకెట్: లైబాయ్–లైఫ్ జాకెట్ అనే పరికరాలు వరదల సమయంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. నీటి ప్రవాహాలు ఎక్కువగా ఉన్న చోట నీటిలో చిక్కుకున్న వారిని కాపాడడానికి వీటిని వినియోగిస్తారు.

సమయస్ఫూర్తితో వ్యవహరించాలి– మల్లికార్జున్ యాదవ్, అగ్నిమాపక అధికారి, మెట్‌పల్లి డివిజన్

ప్రతి వ్యక్తి అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఆందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చు. ఏప్రిల్–14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించాం. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో 08725–235101, 87126 99236, 87126 99237తో పాటు 101కు సమాచారం అందించాలి. సంఘటన జరిగిన వివరాలు క్లుప్తంగా అందిస్తే సకాలంలో చేరుకుని ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

# ఇదే తరుణం.. ఇంకెప్పుడో మోక్షం

పెద్దపల్లి: ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతు, పూడికతీత పనులు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. యాసంగి పంటలకు నీటి విడుదల మరో పక్షం రోజుల వరకు కొనసాగే అవకాశ ముంది. పంట కోతలు చివరి దశలోకి వచ్చినప్పటికీ పలు చోట్ల పంటలు ఆలస్యంగా సాగు చేయడంతో మరికొంత కాలం నీటిని అందించాల్సి ఉంది. ఈ యాసంగిలో ఆటంకాల్లేకుండా సరఫరా జరుగుతున్నా వానాకాలంలో సమృద్ధిగా సాగునీటిని అందించాల్సి రావడం, సీజన్ ముగిసే వరకు సరఫరాకు అంతరాయం లేకుండా పర్యవేక్షించేందుకు అధికారులు సమయాత్తం కావాల్సి ఉంది. ఇప్పటికే వచ్చే సీజన్‌కు సంబంధించి నిధుల కేటాయింపు, మరమ్మతులు, పూడికతీత, లీకేజీల నివారణ, అదనంగా కొత్త కాలువల అనుసంధాన ప్రక్రియపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదని అధికారులే చెబుతున్నారు.

ఏటా అస్తవ్యస్తంగా సరఫరాసాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలతో కాలువల్లో పూడికతీత, ముళ్ల చెట్లు, చెత్తచెదారాల తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది. కాగా కాలువల్లో నీటి సరఫరా ఉండటంతో పనులు చేపట్టే పరిస్థితి లేదు. జిల్లాలో డీ–83 కింద ధర్మారం, జూలపల్లి, పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం, మంథని, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి, అంతర్గాం, రామగిరి, ఎలిగేడు మండలాల పరిధిలో 1,06,623 ఎకరాలు, డీ–86 కింద జూలపల్లి, ధర్మారం, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల,



కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల పరిధిలో 90 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ నీటిని అందిస్తున్నారు. జిల్లాలో రెండు కాలువలు 136 కి.మీ.ల మేర విస్తరించగా అసంపూర్తి పనులకు మోక్షం కలగడం లేదు. పలు చోట్ల వంతెనలు కూలిపోవడం, సైడ్‌వాల్స్ దెబ్బతినడం, ముళ్లచెట్లు పెరగడం వంటి సమస్యలు గుర్తించినప్పటికీ మరమ్మతు చేయడం లేదు. దీంతో భారీ వర్షాలు కురిస్తే కాలువల్లో నీరు నిలిచి, శిథిలమై కూలిపోయే ప్రమాదం ఉంది. జిల్లావ్యాప్తంగా గత వానాకాలంలో 2,89,003 ఎకరాల్లో పంటలు సాగు చేయగా వరి 1,67,800 ఎకరాలు, పత్తి 1,00,000, ఇతర పంటలు 21,203 ఎకరాల్లో వేశారు. డీ–83 కాలువ కింద 1,06,623 ఎకరాలకు 1,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. డీ–86 కాలువ ద్వారా 90 వేల ఎకరాలకు 1,200 క్యూసెక్కుల నీటిని అందించాల్సి ఉంది. మే మొదటి వారంలో సమగ్ర కార్యాచరణ–సత్యరాజ్‌చంద్ర, ఎస్సారెస్పీ ఎస్ఈవానాకాలం సీజన్‌కు ఎస్సారెస్పీ నీటి విడుదలకు ముందే కాలువల్లో పూడికతీత పనులు చేయాల్సి ఉన్నా ఇంకా గుర్తించలేదు. మరమ్మతు పనులు, పూడికతీత, నిధుల ప్రతిపాదనలు, నీటి కేటాయింపులపై త్వరలో కమిటీ సమావేశం నిర్వహించనుంది. మే మొదటి వారంలో సమగ్ర కార్యాచరణ రూపొందిస్తాం.

# క్రమబద్ధీకరణకు కదలిక



గోదావరిఖని: స్థలాల క్రమబద్ధీకరణలో మూడున్నరేళ్ల తర్వాత కదలిక వచ్చింది. ప్రభుత్వం భూ క్రమబద్ధీకరణకు సంబంధించి తాజాగా దరఖాస్తులను ఆహ్వానించింది. 2019, నవంబరు, డిసెంబరులో ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించి దరఖాస్తులు చేసుకున్న భూ యజమానులకు క్రమబద్ధీకరణ ప్రక్రియ నిలిచిపోవడంతో తిరిగి ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) ద్వారా ఆదాయన్ని సమకూర్చుకోవాలని భావించిన ప్రభుత్వం మౌఖిక ఆదేశాలతో క్రమబద్ధీకరణ ప్రక్రియను మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాలతో నగరపాలక, పురపాలక ప్రాంతాల్లోని లేఅవుట్ ప్లాట్లు, ఇంటి స్థలాలను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థ, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 14,850 మంది క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని పరిశీలించాల్సిన అధికారులు మూడున్నరేళ్లుగా పక్కన పెట్టారు. తాజాగా వచ్చిన మౌఖిక ఆదేశాలతో దరఖాస్తులు చేసుకున్న వారి స్థలాలను అన్నీ సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరిం చనున్నారు.

30 శాతం అనుమతులు

మూడున్నరేళ్ల క్రితం ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న స్థల యజమానులు ఇళ్ల నిర్మాణం అనుమతుల్లోనే ఎల్ఆర్ఎస్ కింద 14 శాతం సర్‌ఛార్జి చెల్లించి భవన నిర్మాణ అనుమతులు పొందారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్న 30 శాతం మంది పక్కా భవనాలు నిర్మించుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇంకా 70 శాతం మంది స్థలాలను పరిశీలించి వాటిని క్రమబద్ధీకరించాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యజమాని వివరాలు, స్థలం ఉన్న ప్రాంతాలను టౌన్ ప్లానింగ్ అధికారుల పరిశీలించి క్రమబద్ధీకరించనున్నారు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 7,800 మంది భూ యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. రూ.1000 చెల్లించి ఆన్‌లైన్‌లో తమ భూమి వివరాలు నమోదు చేశారు. ఇందులో కొంతమంది ఎల్ఆర్ఎస్ కింద ఫీజులు చెల్లించి అనుమతులు పొంది భవనాలు నిర్మించుకున్నారు. మరికొంత మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు పొందారు. పెద్దపల్లి పురపాలక సంఘం పరిధిలో 5,700 మంది భూ యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించి క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టనున్నారు. ఇందులో లేఅవుట్‌లకు సంబంధించిన స్థలాలు ఉన్నాయి. సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో 1200 దరఖాస్తులున్నాయి. స్థలాలను క్రమబద్ధీకరించాలని యజమానులు దరఖాస్తు చేసుకొని వాటి కోసం ఎదురు చూస్తున్నారు.

మంథని పురపాలక సంఘం పరిధిలో 150 మంది స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఇదీ ప్రక్రియ

ఎల్ఆర్ఎస్ ఆర్జీల వివరాలు సేకరించి వాటి సర్వే నెంబర్ల ఆధారంగా స్థలాలను పరిశీలిస్తారు. 300 గజాల లోపు స్థలాలుంటే టీపీబీవోలు పర్యవేక్షిస్తారు. నిబంధనల ప్రకారం ఉంటే వాటిని క్రమబద్ధీకరిస్తారు. వివాదాలుంటే వాటిని పక్కన పెడతారు. 300 గజాల కంటే ఎక్కువ స్థలం ఉంటే ఏసీపీలు పరిశీలిస్తారు. స్థలాల క్రమబద్ధీకరణ మార్కెట్ విలువ ప్రకారం ఫీజు నిర్ణయిస్తారు. రిజిస్ట్రేషన్ శాఖ ఖరారు చేసిన మార్కెట్ విలువ ప్రకారం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

# మత్స్య సంపద.. ఉపాధి మెండుగా



కరీంనగర్ : మత్స్యకారులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం జలాశయాలు, చెరువుల్లో చేపలు, రొయ్య పిల్లలను వదులుతుంది. జలాశయాలు, చెరువులు జలకళను సంతరించుకోవడంతో మత్స్య సంపద బాగా పెరగడం వల్ల మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. గ్రామాల్లో మత్స్యకారులతోపాటు చేపల విక్రయాల ద్వారా మరికొందరికి ఉపాధి లభిస్తోంది. జిల్లాలో రాజరాజేశ్వర (మధ్యమానేరు), అన్నపూర్ణ, ఎగువ మానేరు జలాశయాలు ఉన్నాయి. రాజరాజేశ్వర జలాశయంలో నీటి నిల్వ అనంతరం చేప, రొయ్య పిల్లలను వదులుతున్నారు. జిల్లాలోని 430 చెరువులు, జలాశయాల్లో చేప, రొయ్య పిల్లలు వదిలారు. ఇందులో భాగంగా రాజరాజేశ్వర జలాశయంలో 28.50 లక్షల చేప, 26.63 లక్షల రొయ్య పిల్లలు, ఎగువ మానేరులో 10.50 లక్షల చేప, 5.25 లక్షల రొయ్య పిల్లలు విడిచిపెట్టారు. జిల్లాలో 116 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉండగా సుమారు 7,562 మంది సభ్యులున్నారు. నెల రోజుల వయసున్న రొయ్య పిల్లలను జలాశయాల్లో వదులుతుండగా నాలుగు నుంచి ఐదు నెలల వ్యవధిలో సుమారు 450 గ్రాముల బరువు పెరుగుతుంది. చెరువుల్లో 35 నుంచి 40 ఎం.ఎం. బొచ్చె, బంగారు తీగ పిల్లలు, జలాశయాల్లో 80 నుంచి 100 ఎం.ఎం. బొచ్చె, రవు, మోసు రకం చేప పిల్లలు వదులుతున్నారు. కిలో నుంచి పది కిలోల బరువు ఉన్న చేపలు మత్స్యకారులకు లభిస్తున్నాయి.

ప్రతి నిత్యం వేట..మత్స్యకారులు రోజూ సాయంత్రం వేళలో జలాశయంలో తెప్పపై వెళ్లి వలలను అమర్చి వస్తున్నారు. మరుసటి రోజు ఉదయం వెళ్లి వలలో చిక్కిన చేపలను తీసుకొచ్చి సమీపంలోని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒక్కో మత్స్యకారుడికి సుమారు పది కిలోల చేపలు పడుతున్నట్లు చెబుతున్నారు. మత్స్యకారులతోపాటు కొదురుపాక, సంకెపల్లి, రుద్రవరం, జలాశయం సమీప గ్రామాల్లో టేలాలు ఏర్పాటు చేసుకొని చేపల విక్రయాల ద్వారా కొంత మంది ఉపాధి పొందుతున్నారు. కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారి వెంబడి చేపల విక్రయాలు జరుగుతుండటంతో తాజా చేపలను అనేక మంది వాహనదారులు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారు

– సత్తయ్య, కొదురుపాకరాజరాజేశ్వర జలాశయంలో లభిస్తున్న చేపలతో నిత్యం ఉపాధి లభిస్తుంది. రోజూ సాయంత్రం జలాశయంలో వలలు అమర్చి ఉదయం వెళ్లి చేపలు తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నాను. తాజా చేపలు లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి తీసుకెళ్తున్నారు. ప్రధాన రహదారి వెంబడి విక్రయాలు జరుగుతుండటంతో వాహనదారులు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. రోజూ రూ.800 వరకు ఆదాయం లభిస్తుంది.

అనేక మందికి అవకాశాలు– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి జిల్లాలోని మత్స్యకారులకు ఉపాధి కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు జలాశయాలు, చెరువుల్లో చేప, రొయ్య పిల్లలు వదులుతున్నాం. అనుకున్న లక్ష్యం మేరకు చేప, రొయ్యల ఉత్పత్తి వస్తుంది. మత్స్యకారులతోపాటు విక్రయాల ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

# చెత్త, పూడికతో డ్రైనేజీలు

కరీంనగర్ : కశ్మీర్‌గడ్డలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వెనకాల చెత్తాచెదారం ఇది. స్థానికులతో పాటు రిక్షా కార్మికులు తీసుకొచ్చి డంపింగ్ చేస్తుండగా అందులో ప్లాస్టిక్ వ్యర్థాలే అధికంగా ఉంటున్నాయి. ఇలా పలు ప్రాంతాల నుంచి వస్తున్న చెత్తతో స్థానికంగా ఇబ్బందికరంగా మారుతోంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ సవాల్‌గా మారింది. ఓ వైపు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పోటీ పడటంతో పాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటుండగా.. మరోవైపు చెత్త సేకరణ మరింత ఇబ్బందికరంగా మారింది. శివారు కాలనీల్లో మురుగునీటి కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. పైపైనే పనులుప్రధాన వరదకాల్వలకు టెండర్లు పిలిచి పూడిక తీయిస్తుండగా, అంతర్గత వీధుల్లోని మురుగునీటి కాల్వల్లో పైపైనే పూడికతీత పనులు చేస్తున్నారు. ఆయా డివిజన్ల పరిధిలో 11 మంది కార్మికులు పని చేస్తుండగా అందులో ఎవరెవరు ఎక్కడ పని చేస్తున్నారో అర్థంకాని గందరగోళం ఉంటుంది. ప్రతీ వీధిలో మురుగునీటి కాల్వలు ఉన్నా కల్వర్టులు, ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగించడం లేదు. చెట్లు ఉన్న ప్రాంతాల్లో ఎండిన ఆకులు కాల్వల్లో పడుతుండడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. విలీన కాలనీల్లో కచ్చా కాల్వలు ఎక్కువగా ఉండగా వీటిని ఎప్పటికప్పుడూ కాల్వల మాదిరిగా చేయాల్సి ఉంటుంది. లేదంటే మురుగు నీరు అలాగే నిల్వ ఉండి పందులు, జంతువులకు అడ్డాగా మారుతోంది. ఎక్కడ పడితే అక్కడే..నగర వీధుల్లో చెత్త సమస్య ఇబ్బందికరంగా మారుతోంది. స్వచ్ఛ ఆటో కార్మికులు సరైన విధంగా సేకరించకపోవడంతో ఖాళీ స్థలాల్లో ఇంటి యజమానులు పడేస్తున్నారు. కూలర్ల గడ్డి, థర్మకోల్ షీట్లు, కొబ్బరిబొండాలు, ఇంట్లో ఉన్న చెట్లకు సంబంధించిన ఎండిన ఆకులను తీసుకెళ్లడం లేదనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. దాంతో వీటిని బయట పడేస్తున్నారు. ఇదిలా ఉంటే తడి, పొడి చెత్తను తీసుకొచ్చి వీధులలో మూల మలుపుల దగ్గర పడేస్తుండడంతో దుర్గంధంగా మారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నా.. క్రయ, విక్రయాలు ఆగడం లేదు. ఫలితంగా చెత్త కుప్పల్లో ప్లాస్టిక్ శాతమే ఎక్కువగా కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ముందస్తు చర్యలకు ఆదేశాలు– సేవా ఇస్లావత్, కమిషనర్, కరీంనగర్‌వర్షాకాలం రాకముందే ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో ఆదేశించాం. డ్రైనేజీల్లోని పూడిక తొలగించాలని, రోడ్లపై నీరు నిల్వకుండా, ఖాళీ స్థలాలు శుభ్రం చేసేలా శానిటేషన్ సిబ్బందికి సూచించాం.

# సేకరణ సజావుగా సాగేనా!

మెట్‌పల్లి : జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం సేకరణ అటు అధికార యంత్రాంగానికి, ఇటు అన్నదాతలకు సవాలుగా మారనుంది. ఒకవైపు వాతావరణంలో మార్పులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుండగా, మరోవైపు అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు చేయాల్సి ఉంది. అన్ని అడ్డంకులు అధిగమిస్తేనే సేకరణ సజావుగా సాగుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో యాసంగిలో సుమారు లక్షా 18 వేల హెక్టార్లలో వరి సాగు చేపట్టగా 5.31 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. ధాన్యం సేకరణకు ఐకేపీ ఆధ్వర్యంలో 139, సహకార సంఘాల ఆధ్వర్యంలో 275 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం వరి కోతలు జరుగుతుండగా, పలు కేంద్రాల్లో రైతులు ధాన్యం కుప్పలు పోశారు. ఆలస్యంగా సాగైన చోట మరికొన్ని రోజుల్లో కోతలు పూర్తి కానున్నాయి. ఇదిలా ఉంటే ఈదురు గాలులు, వర్షం మూలంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోళ్లు ప్రారంభమవుతున్న సందర్భంలో వర్షం కురవడం, ఆకాశంలో మబ్బులు ఉంటే తేమశాతం పెరిగి కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్రాలను త్వరగా ప్రారంభించడమే కాకుండా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ త్వరగా ముగిసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇంకా ప్రారంభించని కొనుగోళ్లు



జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 75, సహకార సంఘాల ఆధ్వర్యంలో 108 కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ప్రారంభించారు. కేంద్రాలు ప్రారంభించినా ఇంకా ధాన్యం సేకరణ మొదలవ్వలేదు. కేవలం ఒక కేంద్రంలో మాత్రమే లారీ లోడ్ ధాన్యాన్ని సేకరించారు. రైతులు ఇప్పటికేచాలా కేంద్రాల్లో ధాన్యం కుప్పలు పోశారు. కొన్ని చోట్ల ఇంకా ధాన్యం రాకపోవడంతో కేంద్రాలు ప్రారంభించనట్లుగా తెలుస్తోంది. వాతావరణ మార్పులతో..వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మబ్బులు పడుతుండడం, ఈదురు గాలులతో వర్షం కురుస్తుండడంతో ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యం ఉష్ణోగ్రతలు తగ్గడంతో తేమశాతం పెరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని ఎప్పటికపుడు సేకరించి మిల్లులకు తరలించే ప్రక్రియ వేగవంతం చేస్తేనే తమ ఇబ్బందులు తీరుతాయని పేర్కొంటున్నారు. లేకపోతే పగలంతా ఆరబోయడం, ఆకాశం మబ్బులు పడితే మళ్లీ కుప్ప చేయడం, తేమ శాతం పెరగడం వల్ల రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చేస్తేనే..

గతంలో తేమశాతం లేదని, తప్పుతాలు ఉన్నాయని కోతలు విధించడంతో పాటు ధాన్యం దించుకోక, తరలింపులో జాప్యం, రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని తెలుస్తోంది. ఈ ప్రభావం కొనుగోళ్లపై పడే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా కొనుగోళ్లను వేగవంతం చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభించాలని చెప్పడం జరిగిందని, ప్రారంభించిన కేంద్రాల్లో మబ్బుల వల్ల తేమశాతం రాకపోవడంతో ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాలేదని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజాచారి, ఐకేపీ డీపీఎం మల్లేశం తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సేకరణ జరుపుతామని పేర్కొన్నారు.

# టెండర్లు లేకుండానే విక్రయాలు

మల్యాల: కొండగట్టులో కొన్ని పనులను అధికారులు గుట్టు చప్పుడు కాకుండా నచ్చిన వారికి అప్పగించడం రివాజుగా మారింది. దేవుడి సన్నిధిలో చేపట్టే ప్రతి పనిలో పారదర్శక పాటించాల్సిన అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు, వివాదాలకు తావిస్తోంది. తాజాగా ఆలయ అధికారులు ఆంజనేయస్వామి చిత్రంతో కూడిన రాగి లాకెట్లు తయారు చేసి సరఫరా చేసే కాంట్రాక్టును అప్పగించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాగి లాకెట్ల సరఫరాకు సంబంధించి అధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడం గమనార్హం. 6 గ్రాముల లాకెట్‌ను రూ.30లకు, 8 గ్రాముల లాకెట్‌ను రూ.35లకు, 12 గ్రాముల లాకెట్‌ను రూ.40లకు విక్రయించడం ప్రారంభించారు. గుత్తేదారు ఏ మేరకు, ఎంత ధరకు



రాగి లాకెట్లు సరఫరా చేస్తున్నారన్న వివరాలను కూడా సరిగా వెల్లడించడంలేదు. భక్తుల అవసరాల మేరకు గుత్తేదారు తాము విక్రయించే ధర కంటే రూ.10 తక్కువ రేటుతో సరఫరా చేస్తున్నట్లు ఈవో వెంకటేశ్ తెలిపారు. అంజన్న చిత్రంతో తయారైన రాగి లాకెట్లను తెప్పించి విక్రయించడానికి దేవాదాయశాఖ కమిషనరు నుంచి అనుమతి తీసుకున్నట్లు వివరించారు. వెండి లాకెట్లు ఎక్కడ?: స్వామివారికి చెందిన వెండి నిలువలను కరిగించి లాకెట్లుగా తయారు చేసి విక్రయించాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా 9 నెలల క్రితం ఆలయంలో నిలువ ఉన్న 394 కిలోల వెండిని హైదరాబాద్‌లోని 'మింట్'కు అప్పగించారు. ఇప్పటివరకు అధికారులు మింట్ నుంచి వెండిని తీసుకురాలేదు. ఈ విషయమై ఈవో వెంకటేశ్‌ను సంప్రదించగా లాకెట్ల తయారీ రిస్క్‌తో కూడుకుని ఉంటుందని, మింట్‌కు అప్పగించిన వెండిని త్వరలో తీసుకొస్తామన్నారు.

# కమీషన్ కోసం ఎదురుచూపులు

ఖమ్మం :ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, తదితరాలను రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసే డీలర్లు తమకు రావాల్సిన కమీషన్ కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో నాలుగు నెలలుగా కమీషన్ రాకపోవటంతో దుకాణాల నిర్వహణ, అద్దె, హమాలీ కూలీ తదితర ఖర్చుల కోసం డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. సాంకేతిక వినియోగం పెరిగినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 442 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. నెలలో సుమారు 15 రోజులపాటు దుకాణ పరిధిలోని కార్డుదారులకు వీరు బియ్యం పంపిణీ చేస్తారు. ఇందుకుగాను కమీషన్ రూపంలో ప్రభుత్వం కిలోకి రూ.0.70 పైసల చొప్పున వారికి చెల్లిస్తుంది. గతంలో డీఎం కార్యాలయ పరిధిలోనే కమీషన్ జమ చేసేవారు. బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభించిన పక్షం రోజుల తర్వాత డీలర్లు పంపే విక్రయ వివరాల ఆధారంగా దీన్ని ఇచ్చేవారు. ఈ విధానంలోనే సక్రమంగా చెల్లింపులు ఉండేవి. ప్రస్తుత పరిస్థితి భిన్నంగా మారింది. నూతన పద్ధతిలో డీలర్లు బిల్లులు పంపాల్సిన పనిలేదు. కమిషనర్ కార్యాలయం నుంచే నేరుగా



కమీషన్ అందేలా ఏర్పాట్లు చేశారు. ప్రతీ నెలా ఏఏ డీలర్‌కు ఎంత కోటా వెళ్లింది?, ఎన్ని క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశారు? ఎంత మిగులు ఉందనేది ఈపాస్ ద్వారా ఎప్పటికప్పుడు నమోదవుతుంది. ఇంత ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా కమీషన్ సకాలంలో రావడం లేదు. ఖాతాల వివరాల్లో తేడాలున్నాయని చెబుతూ తిప్పి పంపుతుండటం, వాటిని సరిచేసినా బిల్లులు అందకపోవటం పరిపాటిగా మారింది. జనవరి నెల నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో దుకాణం నిర్వహణ, పోషణ కష్టంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే సొమ్ము జమ చేయాలని డీలర్లు కోరుతున్నారు.

**ఖాతా వివరాల్లో తప్పులతోనే ఆలస్యం**

**మల్లికార్జునబాబు, డీసీఎస్వో**

ప్రస్తుతం కమిషనర్ కార్యాలయం నుంచి చెల్లింపులు చేస్తున్నారు. అందరికి ప్రతీ నెల జమ చేస్తున్నారు. వారు అందించిన ఖాతా వివరాల్లో తప్పులు దొర్లిన తరుణంలో జాప్యం చోటుచేసుకుంటోంది. జనవరి నుంచి జమకాని డీలర్లు వివరాలు అందిస్తే పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

# రక్తదాతలు కావలెను

కరీంనగర్ : అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభించకపోతే బాధితులు, వారి సహాయకులు పడే బాధలు వర్ణణాతీతం. ఎవరూ సహకరించకపోతే పరిస్థితి విషమించిన రోగికంటే రక్తం కోసం తిరుగుతున్న వారి బాధే అధికంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చాలామంది ఎదో ఒక దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారే అధికం. అన్నిదానాల కంటే రక్తదానం గొప్పదంటారు. అత్యవసరమైన రోగికి ఎవరో ఒకరు రక్తదానం చేసినా అప్పటికప్పుడు పరిస్థితి విషమించిన రోగులకు ఎక్కించడం కొంత ఇబ్బందికరమైన పనే. రక్తనిధి కేంద్రంలో రక్తం అందుబాటులో ఉంటే అప్పటికప్పుడు రోగికి అందించవచ్చు. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రంలో రక్తం కొరత ఏర్పడింది. 500 పడకల ఆసుపత్రికి దాదాపుగా నెలకు 400 యూనిట్లు అవసరం ఉంటుండగా ప్రస్తుతం కేవలం 50 యూనిట్లు మాత్రమే నిల్వ ఉంది.

ఆరుగంటల్లోగా.. రక్తం గ్రూపులు ఐదు రకాలుంటాయి. అందులో ఏ, బీ, ఏబీ, ఓ పాజిటివ్, నెగెటీవ్‌తో పాటు బాంబే బ్లడ్‌గ్రూప్‌లో పాజిటివ్, నెగెటివ్ ఉంటుంది. ఇందులో దాతల నుంచి సేకరించిన రక్తాన్ని ఆరుగంటల్లోగా మూడు రకాలుగా ఆర్‌బీసీ, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌ను వేరు చేస్తారు. ఇందులో నుంచి వేరుచేసిన ఆర్‌బీసీని 32 రోజుల్లోగా ప్లేట్‌లెట్స్‌ను ఐదు రోజుల్లోపు మాత్రమే వాడుకోవాలి. ప్లాస్మాకు ఒక సంవత్సరం గడువు ఉంటుంది. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 1500 యూనిట్లను నిల్వ ఉంచవచ్చు. ప్రతినెల ఆసుపత్రిలో జరుగుతున్న శస్త్రచికిత్సలకు అవసరానికి అనుగుణంగా 400 యూనిట్ల వరకు రక్తం అవసరం ఉంటుంది. ప్రస్తుతం రక్తనిధిలో కేవలం 50యూనిట్లు మాత్రమే ఉన్నాయి. దాతలు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కళాశాలల యాజమాన్యాలు స్పందించి రక్తదానం చేసేలా అవగాహన కల్పించా



లని వైద్యులు కోరుతున్నారు.

**ఎండాకాలంలోనే ఎందుకు?**

రక్తం కొరత ఎప్పుడూ ఎండాకాలంలోనే ఉంటుంది. వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు కావడంతో రక్తం కొరత ఏర్పడుతుంది. కళాశాలలు ఉన్నప్పుడు ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు డిగ్రీ కళాశాల యజమాన్యాలు ఎవరైనా మహనీయుల జయంత్యుత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ కారణంగా ఎండకాలంతో పోలిస్తే మిగతా రోజుల్లో రక్తం నిల్వలు సమృద్ధిగానే ఉంటాయి.

**సమాచారం ఇస్తే సేకరిస్తాం– హారతి, రక్తనిధి వైద్యురాలు**

జిల్లా ఆసుపత్రిలో ప్రతినెల 400 యూనిట్ల వరకు రక్తం అవసరం ఉంటుంది. ప్రస్తుతం తీవ్ర కొరత నెలకొంది. రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. ఎవరైనా దాతలు స్పందిస్తే ఆసుపత్రిలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తాం. లేదా వారి కార్యాలయం లోనైనా మా బృందం పూర్తిస్థాయి సామగ్రితో వెళ్లి రక్తం సేకరిస్తుంది. కేవలం 20 నిమిషాల్లో ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో నిరుపేదలే అధికంగా ఉంటారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, యువత, రక్త దాతలు స్పందించాలి.

# ఎందుకంత నిరాసక్తత..!



ఖమ్మం : గతంలో సింగరేణిలో కొలువు అంటే ఎంతో ప్రియం. కష్టమైనా ఇబ్బందులను అధిగమిస్తూ ఇష్టంగా పనిచేసేవారు. అధిక వేతనాలకు తోడు కొలువుల విషయంలో బయట అవకాశాల లేమి ఇందుకు ప్రధాన కారణంగా ఉండేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారుతోంది. సింగరేణి కొలువుపై కొందరు ఉద్యోగుల్లో నిరాసక్తత అధికమైంది. విధుల్లో గైర్హాజరు అయ్యే వారి సంఖ్య క్రమేణా పెరుగుతుండటమే ఇందుకు నిదర్శనం. ప్రధానంగా యువతలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికి కనీసం వంద మస్టర్లు ఉద్యోగులు పూర్తి చేయాలి. కానీ వాటిని కూడా పూర్తి చేయకుండా సింగరేణి వ్యాప్తంగా గత ఉత్పాదక సంవత్సరం వెయ్యి మందికి పైగా ఉద్యోగులు విధులకు గైర్హాజరయ్యారు. ఈ తరహా పరిస్థితులతో ఉత్పత్తి లక్ష్య సాధన పూర్తి చేయటం యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. భూపాలపల్లి ఏరియాలో వంద మస్టర్లు పూర్తి చేయని 48మంది ఉద్యోగులను ఇటీవల యాజమాన్యం డిస్మిస్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని వేల మంది నిరుద్యోగులు నిత్యం సాధన చేస్తున్నారు. కానీ గనిలో ఉద్యోగం పొందిన కొందరు విధులకు గైర్హాజరవుతూ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకొంటున్నారు.

**పరివర్తన లేదు**

గైర్హాజరు అయ్యే వారు సక్రమంగా విధులు నిర్వర్తించేలా అధికారులు గనులవారీగా సదరు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా చాలామందిలో ఎటువంటి మార్పు రావటం లేదు. చాలామేర కొరడా ఝుళిపించకుండా మానవీయ కోణంలో మార్పు కోసం ప్రయత్నిస్తుంది. గనుల వారిగా ఉన్న సంక్షేమ అధికారులు ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి విధులకు హాజరు కావాలని నచ్చజెబుతున్నారు. పూర్తి స్థాయి మస్టర్లు లేకుంటే ఉద్యోగికి, సింగరేణి కలిగే నష్టాన్ని వివరిస్తూ హాజరు శాతం పెరిగేలా కృషి చేస్తున్నారు.

**యువ ఉద్యోగులే ఎక్కువ**

గైర్హాజరు అయ్యే వారిలో యువ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారు. గత తొమ్మిదేళ్ల నుంచి వారి సంఖ్య పెరుగుతూ వస్తుంది. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన చాలామంది డిగ్రీ, బీటెక్, పీజీ వంటి ఉన్నత విద్య అభ్యసించిన వారై ఉంటున్నారు. వారికి తొలుత బదిలీ వర్కర్‌గా భూగర్భ గనుల్లో విధులు కేటాయిస్తున్నారు. ఒక్కసారిగా విధి నిర్వహణ వాతావరణం మారటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. మరికొంత మంది ప్రైవేటు కొలువులు నిర్వరిస్తూ సింగరేణిలో విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంకొంత మంది అనారోగ్యంతో బాధపడుతున్నారు.

**విధులకు హాజరుకాని వారికి ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.**

వారిలో కొంత మార్పు ఉంటోంది. ఉద్యోగుల హాజరు శాతం పెరిగేలా ప్రయత్నిస్తున్నాం. గైర్హాజరుతో సింగరేణికి, ఉద్యోగికి నష్టం ఏర్పడుతుంది. అధికారులు సూచనలు పట్టించుకోకుండా విధులకు హాజరు కాని ఉద్యోగులపై చర్యలుంటాయి. దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు.

# వెనకబడితే టీసీ ఇచ్చేస్తారు!




ఖమ్మం : కూసుమంచి మండలానికి చెందిన దివ్యాంగురాలైన బాలిక, తండ్రిలేని మరో విద్యార్థిని.. కొణిజర్ల కేజీబీవీలో ఏడోతరగతి పూర్తిచేశారు. చదువులో వెనకబడ్డారనే సాకుతో వారి కుటుంబ సభ్యులను పిలిచి నాలుగు రోజుల క్రితం నిర్వాహకులు టీసీలు ఇచ్చారు. విద్యార్థులు బతిమిలాడినా కనికరించలేదు. తల్లిదండ్రుల్లేని పిల్లలు, చదువు మధ్యలో మానేసిన పేద విద్యార్థులే ఎక్కువ మంది కేజీబీవీల్లో చదువుతుంటారు. సాధారణంగా వీరు చదువులో కొంత వెనకబడి ఉంటారు. వీరిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే. కొణిజర్ల కేజీబీవీలో ఉత్తీర్ణత శాతం ఆశించిన స్థాయిలో లేదనే సాకుతో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఏటా టీసీ ఇచ్చి పంపిస్తుండటం గమనార్హం.

కొణిజర్ల మండలం బస్వాపురం సమీపంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం మొదటినుంచి వివాదాలకు నిలయంగా మారుతోంది. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు 292 మంది విద్యార్థినులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర ఫిర్యాదులు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మెనూ పూర్తిస్థాయిలో అందించకున్నా అమలుచేసినట్లు, పరాయి వ్యక్తులు పాఠశాలకు వచ్చి అధిక సమయం ఇక్కడే ఉంటారని అందులో సిబ్బంది నుంచే ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యాలయంలో సమావేశాలు, విధుల విషయంలో లోపభూయిష్ట నివేదికలు పంపిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇటీవల కొందరు ఉపాధ్యాయులు తమ వద్దనున్న ఆధారాలతో కలెక్టర్‌ను కలిసేందుకు యత్నించగా అధికారులు సర్దిచెప్పారు.

**విచారణ జరిపితే..**కొణిజర్ల కేజీబీవీలో నిర్వాహకురాలు, ఉపాధ్యాయుల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఇటీవల నిర్వాహకురాలు అక్కడ పనిచేసే అటెండర్‌పైకి బాటిల్ విసిరేయడం, ఆమెకు దెబ్బతగలడంతో వివాదాస్పదమైంది. ఉన్నతాధికారులు విషయాన్ని నాలుగు గోడల మధ్య రాజీచేసి మిన్నకున్నారు. ఉపాధ్యాయులు రెండు వర్గాలుగా విడిపోయి సక్రమంగా బోధించటం లేదనే ఆరోపణలున్నాయి. ఇంకోపక్క చదువులో విద్యార్థులు వెనకబడితే టీసీలు ఇచ్చి పంపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలకు టీసీలు ఇచ్చిన విషయం నా దృష్టికి రాలేదు. వివరాలు సేకరించి విచారణ చేపడతాం. అటెండర్‌తో గొడవ జరిగితే సర్దిచెప్పాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. శ్యాంసన్, ఎంఈఓ, కొణిజర్ల

# రామాలయ పాలన గాడిన పడేనా..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో గత ఏడాది రూ.40 కోట్ల వార్షిక బడ్జెట్ అమలు చేశారు. 2023–24లో రూ.44 కోట్లు ఉంటుందని అంచనా. ఏడాదికి 30 లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. నవమి ఉత్సవాలకు సందర్భంగా మొత్తంగా రూ.4 కోట్ల ఆదాయం సమకూరింది. ఖర్చులు పోను కొంత మిగులుతుందని అంచనా వేశారు. ఆలయానికి ఆదాయ వనరులున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదు. అడిగేందుకు ధర్మకర్తల మండలి లేదు. సమస్యల పరిష్కారానికి అధికారులే చొరవ తీసుకోవాల్సి ఉంది. నూతనంగా ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవి ఇటీవల పాలనాపరమైన అంశాల్లో కొంత దూకుడు ప్రదర్శిస్తున్నారు. అంతర్గత బదిలీలు చేసి తనిఖీ బృందాలను ప్రకటించారు.

**కనీస సౌకర్యమైనా లేకపాయె..!**

భక్తులకు సరైన సదుపాయాల కొరవడ్డాయి. అందుబాటులో మరుగుదొడ్లు లేకపోవడంతో గంటల తరబడి ఉగ్గపట్టి ఉండాల్సి వస్తోంది. కల్యాణకట్ట సమీపంలోని ఖాళీ ప్రదేశంలో వీటిని నిర్మించాలనే ప్రతిపాదనలు కార్యరూపు దాల్చలేదు. ఆలయ సిబ్బంది అవసరాలకు వీఐపీ మార్గంలోని పాత వాహనశాలలో మరుగుదొడ్లు ఉన్నాయి. స్టేడియం వద్ద కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. దీంతో భక్తులకు అవస్థలు తప్పటం లేదు. స్వచ్ఛంద సంస్థ సహకారంతో తాగునీటి సమస్య కొంతమేర తగ్గింది.

**భవిష్యత్తు అవసరాలను గుర్తించాలి**

కేంద్ర ప్రభుత్వం 6 రాష్ట్రాల్లోని 11 ప్రాంతాలను కలుపుతు రామాయణ వలయం రైలు నడుపుతున్నారు. ఇందులో భద్రాచలానికి ప్రాధాన్యం ఉన్నందున రానున్న రోజుల్లో యాత్రికుల తాకిడి తప్పదు. రాష్ట్రపతి ముర్ము ఇటీవల ఇక్కడకు పర్యాటక పనులకు శంకుస్థాపన చేశారు. ఇవి పూర్తయితే టూరిజానికి కొత్తందాలు సమకూరుతాయి. ఇప్పుడున్న



వసతి సదుపాయం రానున్న రోజుల్లో సరిపోదు. కొన్ని కుటీరాలు పూర్తిగా దెబ్బతినడంతో వాడడం మానేశారు. పూర్తయినవాటిని స్వాధీనం చేసుకోకుండా తాత్సారం చేస్తున్నారు.

**ఉద్యోగుల సంగతేంటి..**

నెల క్రితం ఓ ఉప ప్రధానార్చకుని ఉద్యోగ విరమణతో సీనియర్ ముఖ్య అర్చకుడు మురళీకృష్ణమాచార్యులుకు ఉద్యోగోన్నతి కల్పిస్తున్నారు. వచ్చే నెల మరో ముఖ్య అర్చకుడు, ఇద్దరు వాద్య విద్వాంసులు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ ఖాళీలను భర్తీ చేసే చర్యలు అవసరం. ఓ అర్చకుడు ఏడాది నుంచి సెలవుల్లో ఉన్నారు. ఇంకో ఉద్యోగి ప్రత్యేక కారణాలతో విధులు మానేసి ఇటీవల వచ్చారు. తిరిగి విధుల్లో చేరేందుకు కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి అంశాలపైనా దృష్టి సారిస్తేనే సిబ్బంది కొరతను నియంత్రించే వీలుంటుంది.

# కరోనా సేవలకు సన్నద్ధం

కొత్తగూడెం : జిల్లాలో కరోనా కేసులు అక్కడక్కడా నమోదవుతున్నాయి. రాష్ట్ర అధికారుల హెచ్చరికలతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమవుతోంది. పాజిటివ్ కేసులు పెరిగినా తగిన సేవలందించేందుకు సన్నద్ధమవుతున్నారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశించారు. కనీసం రోజుకు నలుగురు అనుమానితుల నుంచి నమూనాలు సేకరించి నిర్ధారణ పరీక్షలు చేయించాలని, పాజిటివ్ వస్తే ఆర్‌టీపీసీఆర్ నిర్వహించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి ఇబ్బందికరంగా మారినవారికి చికిత్స అందించేలా వైద్యాధికారులు తమ పరిధిలోని ఆసుపత్రుల్లో



వసతులు కల్పిస్తున్నారు. కొద్దిరోజులు జిల్లావ్యాప్తంగా మాక్‌డ్రిల్ కూడా నిర్వహించారు.

**సామాజిక దూరం పాటించాల్సిందే..**

కరోనా వ్యాప్తి నేపథ్యంలో భయాందోళన అవసరం లేకపోయినా.. జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్క్ ధరించాలని ప్రచారం చేస్తున్నారు. వేసవి సెలవులతో ప్రయాణాలు పెరిగిపోతున్నాయి. శుభకార్యాలు జోరందుకుంటున్నాయి. రాజకీయ పార్టీల కార్యక్రమాలూ కొనసాగుతున్నాయి.

'జిల్లా ప్రజలు బూస్టర్‌డోస్ తీసుకోవాలి. 8,30,756కి గాను 5,70,673 మంది మాత్రమే టీకా తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో 7, పీహెచ్‌సీలు 29, యూపీహెచ్‌సీలు 5, బీడీకేఎస్ 2, హెచ్‌డబ్ల్యూసీలు 153 ఉండగా.. స్థానిక వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. భయపడాల్సిన పనిలేదు.'డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష

# ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మోక్షం!

ఖమ్మం : ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో మూడేళ్లుగా మూలుగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2019 నవంబరు, డిసెంబరు మాసాల్లో దరఖాస్తులు స్వీకరించారు. తరువాత దీనిపై విపక్షాలు ఆందోళన చేపట్టడంతో తదుపరి ప్రక్రియను నిలిపివేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత ఏర్పడటంతో ప్రభుత్వం నిధులు రాబట్టేందుకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై దృష్టి సారించింది.

ఎలా చేస్తారంటే... రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ల ఆధారంగా ఎల్‌ఆర్‌ఎస్ అర్జీలను పరిశీలిస్తారు. 300 గజాల లోపు స్థలాలను టీపీబీవోలు తనిఖీ చేస్తారు. 300 గజాలు దాటితే ఏసీపీ పరిశీలించాల్సి ఉంటుంది.




ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హత పొందిన స్థల యజమాని చరవాణికి సంక్షిప్త సమాచారం వెళ్తుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా రుసుం చెల్లిస్తే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ శాఖ ఖరారు చేసిన మార్కెట్ విలువ ప్రకారం ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఖమ్మం నగరపాలకంలో వచ్చిన 13,127 దరఖాస్తుల్లో 14 శాతం సర్‌ఛార్జితో సుమారు మూడు వేల మంది దరఖాస్తుదారుల ఇంటి నిర్మాణ అనుమతి పొందినట్టు తెలుస్తోంది. కొత్త బృహత్తర ప్రణాళికపై కసరత్తులు కొనసాగుతున్న తరుణంలో జోన్లు, ఎఫ్‌టీఎల్ నిబంధనలు ఎలా పరిగణలోకి తీసుకుంటారన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఏసీపీలకు, టీపీబీవోలకు లాగిన్‌లు ఇచ్చిన దృష్ట్యా ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# 23,709 ఎకరాల్లో పంట నష్టం

కరీంనగర్ : జిల్లాలో కురిసిన అకాల వర్షం, వడగళ్లు, ఈదురు గాలులు పెద్దఎత్తునే నష్టం మిగిల్చాయి. వ్యవసాయ అధికారులు తేల్చిన ప్రాథమిక అంచనా ప్రకారం అన్ని పంటలు కలిపి 23,709 ఎకరాల్లో నష్టం జరిగింది. 17,197 మంది రైతులు పంట నష్టపోయిన బాధితులుగా ఉన్నట్లు గుర్తించారు. వరి పంట 22,120 ఎకరాల్లో నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాలో తేలింది. 334 ఎకరాల్లో మొక్కజొన్న, 1,172 ఎకరాల్లో మామిడి, బొప్పాయి, మరో 83 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల బృందం పర్యటించిన తర్వాత, పూర్తిస్థాయి పంట నష్టం వివరాలు వెల్లడవుతాయని జిల్లా వ్యవసాయాధికారి వాసిరెడ్డి శ్రీధర్ పేర్కొన్నారు. చొప్పదండి, రామడుగు, సైదాపూర్ తదితర మండలాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పంటలను పరిశీలించి నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

**త్వరలోనే మొదటి విడత సాయం : మంత్రి**

కరీంనగర్ రూరల్ మండలంలో మంత్రి గంగుల కమలాకర్ పర్యటించారు. పంటలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి విడత పంట నష్టంగా జిల్లాకు రూ.8.16 కోట్లు విడుదల అయ్యాయని, త్వరలోనే రైతులకు అందజేస్తామన్నారు. సాధారణంగా యాసంగి కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 20 తర్వాతే ఏర్పాటు చేస్తారని, కానీ సీఎం ఆదేశాలతో ఏప్రిల్ 10నే ఏర్పాటు చేయటంతో కొంత మేర పంటను కాపాడుకోగలిగామన్నారు. కార్యక్రమంలో అదనపు పాలనాధికారి శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, ఎంపీపీ లక్ష్మయ్య, కరీంనగర్ ప్యాక్స్ ఛైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రెడ్డవేణి మధు, తహసీల్దార్ డాక్టర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మూడు సీజన్ల ధాన్యమిచ్చినా.. కమిషన్ రాలే..!

కల్లూరు : రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ఏటా ధాన్యం కొనుగోలు చేస్తోంది. గ్రామాల్లో ఐకేపీ మహిళా సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయిస్తున్నారు. కొన్న ధాన్యానికి ఆయా సంఘాలకు కమీషన్ ఇవ్వాల్సి ఉంది. 2020లో కొనుగోలు చేసిన ఖరీఫ్, రబీ, 2021 ఖరీఫ్ సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన కమీషన్ ఇప్పటి వరకు ఇవ్వలేదు. మళ్లీ ఈ యాసంగిలో పండించిన ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. కేంద్రాల నిర్వహణకు ఐకేపీ సంఘాల సభ్యులు కొందరు పొదుపు సంఘాల నిధులను ఖర్చు పెట్టారు. మరికొందరు అప్పులు తెచ్చుకున్నారు. ఇప్పటి వరకు కమీషన్ డబ్బులు రాకపోవడంతో అప్పులు భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

236 కేంద్రాల ద్వారా...గత ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా ఐకేపీ, మెప్మా మహిళా సంఘాలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్, మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా 2.76 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశారు. దానికి సంబంధించిన కమీషన్ సుమారు రూ. 6కోట్ల రూపాయలు ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు రావాల్సి ఉంది.



క్షేత్ర స్థాయిలో 2020-21కి సంబంధించి ఖరీఫ్, రబీకి రూ. 14కోట్లు, 2021-22 ఖరీఫ్‌కు సంబంధించిన సుమారు రూ. 6కోట్లు కమీషన్ రావాల్సి ఉంది. ఏడాదిన్నర దాటినా ఇప్పటివరకు కమీషన్ రాలేదు. ధాన్యం కొనుగోలు ద్వారా వచ్చే కమీషన్‌తో ఎంతోకొంత ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని పలు ఐకేపీ మహిళా సంఘాలు ధాన్యం సేకరించాయి. సుమారు రెండు నెలలుపాటు సభ్యులు కొనుగోలు కేంద్రాల్లో కష్టపడ్డారు. ఇప్పటి వరకు కమీషన్ రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం..

ధాన్యం కొనుగోలుకు సుమారు రెండు నెలలు కష్టపడ్డాం. మూడు సీజన్ల కొనుగోళ్లకు సంబంధించిన కమీషన్ రావాలి. అది వస్తే కొంతైనా మిగులుతుందని భావించాం. ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కేంద్రం నిర్వహణ ఖర్చులు కోసం అప్పులు తీసుకొచ్చాం. వారికి సకాలంలో ఇవ్వకపోవడంతో బాధగా ఉంది. ఇకనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఆర్థికంగా వెసులుబాటు కల్పించాలని కోరుతున్నాం.

# ఎత్తిపోతల మరమత్తులకు ఉత్త చేతులే..!

ఖమ్మం : పంటల సాగుకు ఆధారమైన ఎత్తిపోతల పథకాలు దీర్ఘకాలంగా మూలనపడినా పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. చిన్నపాటి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే చాలా పథకాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఆయకట్టు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లాలో సగానికి సగం పథకాలు ఇలాగే ఉన్నా వాటి బాగోగులు పట్టించుకనేవారే కరవయ్యారు. మోటార్లు మొరాయిస్తూ కొన్ని, పైపులైన్లు శిథిలమై మరికొన్ని, నిర్వహణ పనులు సక్రమంగా లేక, విద్యుత్తు సరఫరాలో సాంకేతిక సమస్యలతో పలు ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి.

నిధుల లేమితో నిర్వీర్యం

జిల్లాలో 135 ఎత్తిపోతల పథకాలు ఉండగా అందులో 65 పనిచేయటంలేదు. మరో 19 పాక్షికంగా పనిచేస్తున్నట్లు అధికారిక లెక్కలు చూపుతున్నా.. అవీ నిరుపయోగంగానే మారాయి. మూడేళ్లుగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. మరో పక్షం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుంది. పంటల సాగుకు వీలుగా భూమిని సిద్ధం చేయాల్సిన రైతులు దిక్కుతోచన స్థితిలో ఉన్నారు. ప్రజాప్రతినిధులు సైతం పథకాల పునర్వినియోగంపై ఆసక్తి చూపటంలేదు. ఆయకట్టు రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం.

సత్తుపల్లి, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో ఎక్కువగా పథకాలున్నాయి. వీటిలో 30 ఏళ్ల క్రితం నిర్మించినవి చాలా ఉన్నాయి. వార్షిక నిర్వహణ



లేకపోవటం, చిన్నపాటి మరమ్మతులు చేసేవారు లేకపోవటంతో మోటార్లు మొరాయించి తుప్పు పట్టిపోతున్నాయి. మూడేళ్ల క్రితం మున్నేరు నదికి వచ్చిన వరదలకు ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో ఎత్తిపోతల పథకం పూర్తిగా దెబ్బతింది. మోటార్లు వరదలో కొట్టుకు పోయాయి. పైపులు శిథిలం అయ్యాయి. ఈ పథకం కింద 600 ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలోని ఎత్తిపోతల పథకాలు, వాటికింద ఆయకట్టు రైతుల వ్యథ ఏళ్లుగా కొనసాగుతూనే ఉంది.

జిల్లాలో 135 ఎత్తిపోతల పథకాల కింద 46,777 ఎకరాల ఆయకట్టు ఉండగా పనిచేస్తున్న 51 ఎత్తిపోతల పథకాల కింద 28,674 ఎకరాలు, పనిచేయని 65 పథకాల కింద 9037 ఎకరాలు, పాక్షికంగా పనిచేసే 19 పథకాల కింద 9066 ఎకరాల ఆయకట్టు ఉంది.

జిల్లాలో ఎత్తిపోతల పథకాలు కొన్నింటికి మరమ్మతులు చేయాల్సిన అసవరం ఉంది. ఇందకోసం రూ. 4 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గతేడాది 5 ఎత్తిపోతల పథకాలను రూ. 21 లక్షలతో మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన తర్వాత మిగతావి పూర్తి చేయిస్తాం. అంత వరకు చిన్నపాటి మరమ్మతులను ఆయకట్టు రైతులు చేసుకోవాలని సూచించాం. శంకర్‌నాయక్, నీటిపారుదల శాఖ, సీఈ, ఖమ్మం

# వీధి వ్యాపారులకు చేయూత



కరీంనగర్ : వీధివ్యాపారులు కరోనా, లాక్‌డౌన్ సమయంలో దయనీయ పరిస్థితులు ఎదుర్కొనగా.. ఇప్పటికీ కోలుకోవడం లేదు.. కొంతమేర వారి జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు, జీవనోపాధిలో చేదోడుగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పీఎం స్వనిధి పథకం ద్వారా రుణాలు మంజూరు చేసింది. అన్ని పుర, నగరపాలికల్లో లక్ష్యాన్ని విధించగా..రెండోవిడత రుణాలు అందేలా చర్యలు చేపట్టారు. వీధి వ్యాపారుల కుటుంబ స్థితి గతులు తెలుసుకోవడానికి స్వనిధి నుంచి సమృద్ధి వైపు మళ్లించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని మొదటగా తొమ్మిది నగరపాలక సంస్థలను ఎంపిక చేశారు. అందులో కరీంనగర్ ఒకటి కాగా, రెండోవిడతలో జగిత్యాల మున్సిపాలిటీ ఎంపికైనట్లు సమాచారం.

సంక్షేమ పథకాలు అమలు కేంద్ర ప్రభుత్వం స్వనిధి కింద వీధివ్యాపారులకు రుణాలు ఇస్తుండగా వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎనిమిది రకాల పథకాలు వీరికి అందించాల్సి ఉంటుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు బీమా వర్తింపజేయడం, ప్రతీ ఒక్కరికీ రేషన్‌కార్డు అందేలా చూడటం వంటి సంక్షేమ పథకాలు ప్రధానంగా ఉన్నాయి.

ఎనిమిదింటిలో 45,818 మంది అర్హులు

కేంద్రం అమలు చేస్తున్న ఎనిమిది రకాల పథకాలకు ఒక్క కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోనే 45,818 మంది కుటుంబ సభ్యులు అర్హులుగా ఉన్నారు. వీరిలో 45,349 మంది దరఖాస్తు చేసుకోగా, 45,232 మంది కుటుంబ సభ్యులకు మంజూరయ్యాయి. పీఎం స్వనిధి కింద మొదటి విడతలో 9,845 మందికి, రెండో విడతలో 2,285 మంది వీధివ్యాపారులకు రుణాలు మంజూరయ్యాయి.

# పురపాలిక.. ఆటలకు వేదిక




కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో క్రీడా మైదానాలు కనుమరుగవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఒకటెండ్రు ఉన్నా పెరుగుతున్న జనాభాకు సరిపోవడం లేదు. పిల్లలు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసంతో ఎదిగేందుకు వీలుగా వార్డులు, గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగిన పట్టణ, పల్లె ప్రగతి నిర్వహణ సమావేశంలో ఆదేశించడంతో ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. కరీంనగర్, రామగుండం నగరపాలికలు, మున్సిపాలిటీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ముమ్మరం చేశారు. కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీలో భాగంగా ఏటా నగరపాలక సంస్థ తరఫున క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సారి దీనికోసం రూ. 10లక్షలు కేటాయించారు. క్రీడాశాఖ మైదానంలో శిక్షణ ఇస్తుండగా ఎప్పటికీ నగరపాలికలోనే క్రీడలను నిర్వహించుకునేలా ప్రణాళికలు చేస్తున్నారు. ప్రత్యేకంగా విభాగం చేసి క్రీడలను ప్రోత్సహించేలా డిప్యూటేషన్‌పై కోచ్‌లను నియమించుకోవాలని భావించి క్రీడా మైదానాలు అన్వేషిస్తున్న సమయంలోనే పట్టణ ప్రగతి కార్యక్రమంలో దీనికి ప్రాధాన్యం ఇవ్వడంతో నగరపాలకకు మార్గం సులభమైంది. తెలంగాణ క్రీడా ప్రాంగణం (టీకేపీ-అర్బన్) పేరుతో ప్రతీ మున్సిపాలిటీలో క్రీడా ప్రాంగణలు నిర్మించేందుకు వార్డుల వారీగా లక్ష్యాన్ని విధించారు. కనీసం ఒక వార్డుకు మూడు ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో పేరుగాంచిన ఐదు క్రీడలకు సరిపడా మైదానం ఒకే చోటా ఉండేలా ఎకరం స్థలం తప్పనిసరిగా ఉండాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని పురపాలికలకు సీడీఎంఏ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేశారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ పిట్, వ్యాయమం చేసేందుకు సింగిల్, డబుల్ బార్ ఉండేలా, వీటికి మైదానాలు ఎంతమేర ఉండాలనే విషయాలతో మార్గదర్శకాలు, డిజైన్ విడుదల చేశారు. దీంతో పాటు చుట్టూ మొక్కలను పెంచాలి. వచ్చే నెల 2లోగా నగరంలో నిర్ణయించిన టార్గెట్ ప్రకారం మైదానాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర పరిధిలో ముందుగా గుర్తించిన స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నట్లు నగర మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. ఈ మేరకు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేస్తామని ప్రకటించారు.

ప్రతీ వార్డు, డివిజన్‌లో మైదానం

ప్రభుత్వ ఆదేశాల మేరకు పుర, నగరపాలికల్లోని అన్నీ వార్డులు, డివిజన్లలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించి అవసరమున్నంత మేరకు దీనికోసం తీసుకునే అవకాశముంది. విలీన కాలనీల్లో ఎక్కువగా స్థలాలు ఉండగా అక్కడ ఎలాంటి సమస్యలుండవు. పెద్ద మున్సిపాలిటీల్లో స్థలం దొరకడం గగనమే. ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండేలా పాలకవర్గ సభ్యులు, అధికారులు ఆలోచన చేయాలి. వీటిని ఏర్పాటు చేయడంతోనే క్రీడా సామగ్రి కొనుగోలు చేసేందుకు రూ. 50వేలు ఇవ్వనుంది. క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడాకారుల నుంచే కమిటీ ఉంటుంది. కమిటీ పర్యవేక్షణలోనే క్రీడా ప్రాంగణలు, క్రీడలు ఉంటాయి.

# భూసమీకరణం

వరంగల్ :రాష్ట్ర ప్రభుత్వం భూసమీకరణ పేరుతో తమ సాగుభూములు తీసుకుంటే ఊరుకునేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. సాగు భూములను కోల్పోతే వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తాము ఉపాధి కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల భూసమీకరణకు జరుగుతున్న ప్రయత్నాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని గ్రేటర్ వరంగల్ పరిసర ప్రాంతాల నుంచి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 22,749 ఎకరాల భూసమీకరణ చేపట్టనున్నట్లు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) సర్వే నెంబర్లతో గత నెల 30న ప్రకటన విడుదల చేసింది. అప్పటినుంచి భూమి కోల్పోతున్న రైతులు నిరసనలు చేపట్టారు. దీంతో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కుడా ప్రకటించింది.

ఐక్యంగా ఆందోళనబాట

తాత్కాలిక ప్రకటనలతో మభ్యపెడుతున్నారని, తమ భూములను ఎవరికీ ఇవ్వబోమని ఐక్యంగా పోరాడి సాధించుకుంటామని రైతులు ఆందోళన బాటపట్టారు. ఈ క్రమంలోనే బుధవారం నష్కల్ శివారులోని హైదరాబాద్-వరంగల్ జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. నిరసనకు మద్దతుగా భాజపా జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుదుల రాకేష్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దొమ్మటి సాంబయ్య, సీపీఎం పార్టీల నేతలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును విమర్శించారు. భూ సమీకరణ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐకాస పోరాటం

పంట భూములను ఎట్టిపరిస్థితుల్లో వదులుకునే ప్రసక్తిలేదని రైతులు తేల్చిచెబుతున్నారు. ఇందుకోసం ఎనిమిది మండలాలకు చెందిన 15 వేల మంది బాధిత రైతులు ఉద్యమం చేయాలని నిర్ణయించారు. 29 గ్రామాలకు చెందిన రైతులు ఐకాసగా ఏర్పడి ఒక్కో గ్రామం నుంచి ఐదుగురిని ఎంపిక చేసుకొని నాయకుడు లేకుండా కమిటీగా ఏర్పడ్డారు. వీరి ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఎప్పటికప్పుడు నిరసనలు చేపట్టి పాలకులను నిలదీయాలని నిర్ణయించుకున్నారు.

మరో పని చేయలేను-చెన్నూరి వెంకటయ్య, రైతు పున్నేలు గ్రామం



నాకున్న మూడెకరాల భూమిని సాగుచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ వారు వేరుగా ఉంటున్నారు. నాకు వ్యవసాయం తప్ప మరేపని రాదు. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్ పథకంలో నీ భూమి పోతుందని పలువురు రైతులు చెబుతుంటే ఆందోళనగా ఉంది.

కూతురి పెళ్లిచేసి ఇబ్బంది పడుతున్నా..-కొట్టం రాజు, రైతు ఒంటిమామడిపల్లి గ్రామం

తాతల కాలం నుంచి వస్తున్న భూమి 20 ఎకరాలు ఉంది. మొత్తం భూమి భూ సమీకరణలో పోతుంది. ఇటీవల నా బిడ్డ వివాహం చేశాను. పెళ్లి సమయంలో నా కూతురికి రెండెకురాల భూమి ఇచ్చాను. ప్రస్తుతం ల్యాండ్ పూలింగ్‌లో ఆ భూమి ఉంది. దీంతో మా అల్లుడు భూమి మాకొద్దు అని మొండికేశాడు. భూమిని అమ్మి సొమ్ము ఇవ్వమని, మరోచోట భూమి కొనుగోలు చేస్తామని చెబుతున్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో భూమికి తక్కువ ధర పలుకుతోంది. కూతురు, అల్లుడి నుంచి వస్తున్న ఒత్తిడి నన్ను తీవ్రంగా బాధిస్తుంది.

వ్యవసాయం చేసి బిడ్డలను పెంచాను-డోబిల లలితా, మహిళా రైతు, వెంకటాపూర్ గ్రామం

భర్తను కోల్పోయిన నాకు వ్యవసాయం గౌరవంగా బతుకుదెరువును చూపింది. నాకున్న నాలుగెకరాల భూమిలో పంటసాగు చేసి నా ఇద్దరి కూతుర్లు, కుమారుని పెళ్లి చేశా. పంటసాగుతో జీవనోపాధి పొందుతున్న మా కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుంది.

# నాలుగు దశల్లో ముదింపు

కొత్తగూడెం : పట్టణాల్లో ఉత్పత్తవుతున్న వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం, వాహనాల ద్వారా తరలించడం, యంత్రాలను ఉపయోగించి పునర్వినియోగించడం.. ఇలా వ్యర్థాలకు అర్థం కల్పిస్తూ ఆదాయంగా మలుస్తున్నారు. పౌరుల భాగస్వామ్యంతో పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తున్న సంస్థలకు కేంద్రం ర్యాంకులు, అవార్డులు, నగదు ప్రోత్సహాకాన్ని అందజేస్తోంది. 2016 నుంచి కేంద్రం స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోంది. ఏటా కేంద్ర బృందాలు స్థానిక సంస్థల పనితీరును గుర్తిస్తున్నాయి. తాజాగా స్వచ్ఛ సర్వేక్షణ్ 2023




టూల్‌కిట్‌ను దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి మనోజ్‌జోషి ఇటీవల విడుదల చేశారు. 2023లో ఆర్‌ఆర్‌ఆర్(రెడ్యూస్ రీసైకిల్ రీయూజ్)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేల్లో మూడు దశలుండగా తాజాగా నాలుగు దశల్లో మదిస్తారు.

ఈసారి ఆర్‌ఆర్‌ఆర్‌కే ప్రాధాన్యం

స్వచ్ఛసర్వేక్షణ్ ఒక్కో ఏడాది ఒక్కో అంశాన్ని లక్ష్యంగా చేసుకుని పనులను నిర్దేశిస్తున్నారు. గతేడాది సామాజిక, బహిరంగ మరుగుదొడ్ల నిర్మాణం, తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం వంటి అంశాలను లక్ష్యంగా ఉంచారు. 2023లో వ్యర్థాలను పునర్వినియోగం చేసి ఆదాయాన్ని ఆర్జిస్తున్న పురపాలికలను గుర్తించనున్నారు. దీనినే ఆర్‌ఆర్ ఆర్(రెడ్యూస్ రీయూజ్ రీసైకిల్)గా పిలుస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

# లారీలు రాక... కాంటాలు కాక

వేములవాడ : ఈ ధాన్యం బస్తా వద్ద కూర్చొన్న మహిళా రైతు పేరు కొంపల్లి లచ్చవ్వ. ఈమెది వేములవాడ గ్రామీణ మండలంలోని మల్లారం. ధాన్యం తీసుకొచ్చి వారం రోజులైంది. తేమ శాతం వచ్చినా లారీల కొరత కారణంగా కాంటా పెట్టలేదు. దీంతో రోజూ కుప్పను చూస్తూ ఇలా చెట్టు కింద కూర్చొంటుంది. లచ్చవ్వనే కాదు ఇలా చాలా మంది అన్నదాతలు ధాన్యం కాంటాలు కాక పడిగాపులు కాస్తున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. చాలా కేంద్రాల్లో లారీలు రాకపోవడంతో కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కాంటాలు పెట్టడం లేదు. దీంతో కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం కుప్పలు, కాంటాలైన బస్తాలు పేరుకుపోయాయి. పలు దఫాలుగా కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడిన రైతులకు రోజూ ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలో యాసంగిలో 1.18 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సింగిల్ విండోలు, ఐకేపీ, డీసీఎంఎస్, మెప్మా ద్వారా 265 కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభమై దాదాపు 20 రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. తూకాలైన బస్తాలను మిల్లులకు తరలించడానికి అవసరమైన లారీలు, ఇతర వాహనాల కొరత కారణంగా చాలా కేంద్రాల్లో బస్తాలు పేరుకుపోతున్నాయి. మరోవైపు వర్షాల భయం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆందోళనకు గురిచేస్తోంది. తూకాలైన బస్తాలపై



టార్పాలిన్ కవర్లు కప్పి పెట్టారు. లారీలు వస్తే మిల్లులకు తరలించేందుకు ఎదురుచూస్తున్నారు. మరో వైపు కాంటాలు కాక రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు పడుతున్నారు.

వారం రోజులుగా నిరీక్షణ...లారీల కొరతతో కేంద్రాల్లో సకాలంలో ధాన్యం కాంటాలు కావడం లేదు. ఫలితంగా రైతులు తమ ధాన్యం కుప్పల వద్ద వారం రోజులుగా నిరీక్షిస్తున్నారు. చాలా చోట్ల రోజుల తరబడి కుప్పలు కాంటాలకు నోచుకోవడం లేదు. జిల్లాలో రోజూ 270 నుంచి 280 వరకు లారీల ధాన్యాన్ని తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అలా జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రైసు మిల్లుల యజమానులు సకాలంలో లారీల నుంచి ధాన్యం బస్తాలను దింపుకోవడం లేదు. దీనివల్ల మిల్లుల వద్ద లారీలు నిలిచిపోయి ధాన్యం తరలింపులో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంతో కేంద్రాల్లో పెద్ద ఎత్తున నిల్వలు, కాంటాలైన బస్తాలు పేరుకుపోతున్నాయి. మిల్లుల్లో నిల్వలుండటంతో మిల్లుల యజమానులు ధాన్యం దింపుకునేందుకు వెనుకంజ వేస్తునట్లు తెలుస్తోంది. జిల్లాలో ఒక్కొక్క కేంద్రంలో దాదాపు రెండు, మూడు లారీల ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నట్లు కర్షకులు పేర్కొంటున్నారు. ధాన్యం కాంటాలు పెడితే సమస్యలు ఎక్కువ అవుతుందని కేంద్రాల నిర్వాహకులు లారీల రాకను బట్టి తూకాలు వేస్తున్నారు. దీంతో రైతులు రోజుల తరబడి కుప్పల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది.

కొనుగోళ్ల వేగవంతానికి చర్యలు- హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల మేనేజరుధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సాధ్యమైనంత వరకు లారీల కొరత లేకుండా చూస్తున్నాం. జిల్లాలో ప్రతి రోజు 185 లారీల్లో ధాన్యం లోడ్ చేసి మిల్లులకు తరలిస్తున్నాం. లారీలతో పాటు డీసీఎం వ్యాన్లు, ట్రాక్టర్లను ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

# అవినాష్‌రెడ్డి పిటిషన్‌పై నేడు విచారణ.. హైకోర్టు నిర్ణయంపై ఉత్కంఠ



హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. బుధవారం విచారణ చేపడతామని పిటిషనర్ తరఫు న్యాయవాదులకు మంగళవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి చెప్పినప్పటికీ ఇవాళ్టి జాబితాలో ఆ పిటిషన్ లేదు. దీంతో కోర్టు మొదలవుగానే అవినాష్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ జరపాలని ఆయన తరఫు న్యాయవాదులు న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. ఇవాళ జాబితాలో లేని కేసులపై విచారణ చేపట్టలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గురువారం విచారణ చేపట్టాలని న్యాయవాదులు కోరగా.. అందుకు న్యాయమూర్తి సమ్మతించారు. రేపు మధ్యాహ్నం 3గంటలకు విచారణ చేపడతామని తెలిపారు. వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డికి గతంలో తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఉపశమనం కల్పించగా.. ఆ ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

అలాంటి ఆదేశాలను ఎలా ఇస్తారని ప్రశ్నించింది. కనీసం 24గంటల పాటు అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలన్న అవినాష్ రెడ్డి న్యాయవాదుల విజ్ఞప్తిని తోసిపుచ్చింది. విచారణలో భాగంగా ముందుగానే లిఖితపూర్వక ప్రశ్నలు అందించాలన్న అంశాన్ని తప్పుబట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో అవినాష్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.




సింహాచలం : సింహాద్రి అప్పన్నస్వామి నిజరూప దర్శనం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. గత ఏడాది చందనోత్సవం రోజున కొందరు భక్తులు నిజరూప దర్శనం వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. తాజాగానూ ఇలాగే చేయడం దుమారం రేపుతోంది. ఆగమ శాస్త్రానుసారం స్వయంభూ మూర్తుల వీడియో, ఫొటో తీయకూడదు. వరుసగా రెండో ఏడాది ఇలా జరగడం చర్చనీయాంశమైంది. రాష్ట్రమంత్రి గన్‌మన్ ఒకరు నిజరూపం వీడియో తీయడాన్ని గమనించిన దేవాదాయశాఖ అధికారులు అతడి సెల్‌ఫోన్ లాక్కున్నట్లు సమాచారం. గత ఏడాది ఘటనపై దేవస్థానం అధికారులు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రకటించినా దర్యాప్తు జరిగిన దాఖలాలు లేవు. ఈ అలసత్వం వల్లే ఈ ఏడాది పునరావృతమైందని దేవస్థానంలో చర్చ జరుగుతోంది.

**చందనోత్సవ వైఫల్యంపై జేసీ ఆధ్వర్యంలో విచారణ :** సింహగిరిపై చందనోత్సవం వైఫల్యంపై విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున విచారణకు ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ విశ్వనాథన్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణ చేపట్టి, వీవీఐపీ టికెట్ల జాబితాను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ టికెట్ల జారీకి రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను తనిఖీచేసి.. టికెట్లు, వాహనపాసుల జారీపై విచారణ చేపట్టానన్నారు. భక్తులకు తాగునీటి సరఫరా తదితర అంశాల్లో వైఫల్యాలపైన, సీసీ కెమెరాల ఫుటేజీలనూ పరిశీలించాల్సి ఉ ఒదన్నారు. నాలుగైదు రోజుల్లో విచారణ పూర్తిచేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు.

**భక్తులకు ఒరిగేదేమీ లేదు: ట్రస్టీలు :** చందనోత్సవం వైఫల్యంపై జిల్లా యంత్రాంగం ద్వారా విచారణ జరిపించడంపై దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకే వీవీఐపీ టికెట్ల విక్రయాలు జరిగినట్లు ఆరోపణలున్న నేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారులతో విచారణ జరిపిస్తే పారదర్శకంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. బాధిత భక్తులు, ట్రస్టుబోర్డు సభ్యులతో మాట్లాడకుండా విచారణ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ విచారణ వల్ల భక్తులకు ఒరిగేదేమీ లేదని అసహనం వ్యక్తం చేశారు.

# 'త్వరలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సభ.. రాహుల్ హాజరు'



విజయవాడ: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కర్ణాటక ఎన్నికల తర్వాత సభ ఏర్పాటు చేస్తామని.. సభకు రాహుల్ గాంధీ హాజరుకానున్నట్లు ఏపీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... జై భారత్ సత్యాగ్రహ సభ విజయవంతం చేసినందుకు కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలియజేశారు. 1921 సంవత్సరంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన ప్రదేశంలో సభ నిర్వహించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉంది అన్న వాళ్లకు మొన్న సభ కనువిప్పు కలిగిస్తుందని చెప్పారు. అన్ని జిలాల్లో ఇలాంటి సభలు నిర్వహిస్తామని అన్నారు. నియోజకవర్గం స్థాయిలో పార్టీ నేతలతో సమీక్ష చేస్తామన్నారు. కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెచ్చేలా పెద్దలతో కలిసి ముందుకు సాగుతామని తెలిపారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో మార్పుకి నాంది కానున్నాయన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలోని 12జిల్లాల్లో తెలుగు వాళ్ల ప్రభావం ఉ ఒదని ఆయన అన్నారు. ఏపీకి బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. విభజన చట్టంలో ఉన్న అంశాలను అమలుచేయ లేద న్నారు. దేశంలో, రాష్ట్రంలో పరిస్థితులపై ఒక్కసారి ఆలోచన చేయాలని సూచించారు. అనేక బిల్లులపై చట్టం చేసిన బీజేపీ.. ఏపీ విషయంలో మాత్రం మాట తప్పిందని విమర్శించారు. పోలవరం, హోదా, స్టీల్ ఫ్లాంట్, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విషయంలో మోదీ ప్రజలను మోసం చేశారన్నారు. తెలుగు ప్రజలంతా బీజేపీకి బుద్ధి చెప్పేలా ఓడించాలని.. కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఏపీలో భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి త్యాగ మూర్తి ఆంధ్రాబ్యాంకు స్థాపించారన్నారు. దేశ, విదేశాల్లో ఆంధ్రాబ్యాంకు చూసి తెలుగువాళ్లు గర్వపడేవాళ్లని.. అటువంటి ఆంధ్రా బ్యాంకును విలీనం చేసి చరిత్ర లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాది ప్రాభవం కోసం పెత్తనం చేస్తున్నారన్నారు. కర్ణాటకలో ఉన్న తెలుగు వాళ్లంతా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. రఘువీరా రెడ్డి, శైలజానాథ్, మస్తాన్‌వలీలకు కొన్ని ప్రాంతాల్లో బాధ్యతలు ఇచ్చినట్లు చెప్పారు. మే ఒకటి నుంచి కర్ణాటకలో ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలిపారు. "మోదీ మోసాలను గుర్తించండి.. కాంగ్రెస్‌ను గెలిపించండి" అంటూ ఏపీసీసీచీఫ్ గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు.




కడప: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు వ్యవహారంపై వైకాపా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని అనవసరంగా ఇరికించారని ఆరోపించారు. కడపలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో వైకాపా ముఖ్యనేతలతో అవినాష్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌తో రెడ్డి పాటు పలువురు ముఖ్యనేతలు హాజరయ్యారు. అవినాష్‌ను సీబీఐ అరెస్ట్ చేస్తే ఎలా ముందుకెళ్లాలనేదానిపై సమావేశంలో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "ఈ కేసులో ఇక అవినాష్‌రెడ్డి అరెస్ట్ తప్పదు. అరెస్టయినా ఆయన బెయిల్‌పై బయటకు వస్తారు. ఈ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు వెనకుండి కుట్ర చేసి అవినాష్‌ను ఇరికించే ప్రయత్నం చేశారు. అవినాష్‌రెడ్డి హింసను ప్రేరేపించరని మనసాక్షిగా నమ్ముతున్నా.. మొదటి నుంచీ నేను ఇదే చెబుతున్నా. నిందితుడిగా చేర్చినంత మాత్రాన నేరం చేసినట్లు కాదు. హత్యలో అవినాష్ పాత్ర ఉందని రుజువైతే నేను రాజకీయాల్లో ఉండనని చెప్పా. నిందితుడిగా చేరిస్తే రాజీనామా చేస్తానని చెప్పలేదు. న్యాయస్థానంలో ఆ విషయం రుజువైతే రాజీనామా చేస్తాననే మాటకు నేను కట్టుబడి ఉన్నాను" అని శివప్రసాద్‌రెడ్డి అన్నారు.

# ఏపీలో మే 1 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు.. జూన్ 12 నుంచి రీఓపెన్



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్థలకు వేసవి సెలవుల తేదీలపై విద్యాశాఖ స్పష్టత ఇచ్చింది.

ఏప్రిల్ 30వ తేదీని ఈ అకడమిక్ ఇయర్ చివరి తేదీగా ప్రకటించిన విద్యాశాఖ.. మే 1 నుంచి జూన్ 11వ తేదీ దాకా పాఠశాలలకి వేసవి సెలవులు ఇవ్వనున్నట్లు పేర్కొంది. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం.. తిరిగి జూన్ 12వ తేదీ సోమవారం పాఠశాలలు వచ్చే అకడమిక్ ఇయర్‌కుగానూ పునఃప్రారంభం అవుతాయి. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నింటికీ ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు.

# ఆయనకు జ్ఞానం లేదా.. చదువుకోలేదా?.. ఆదిమూలపు సురేష్‌నుద్దేశించి మంత్రి నాగార్జున



ఒంగోలు : 'మంత్రి ఆదిమూలపు సురేష్ తన చొక్కా తానే ఎందుకు విప్పుకొంటారు. ఆయనకు జ్ఞానం లేదా? చదువు లేదా? చొక్కా విప్పుకొని అర్ధనగ్న ప్రదర్శన చేశారనేది తెలుగుదేశం పార్టీ, దాని అనుకూల మీడియా చేస్తున్న దుష్ప్రచారం మాత్రమే'నని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వ్యాఖ్యానించారు. ఒంగోలులో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబునాయుడు యర్రగొండపాలెంలో పర్యటించిన సందర్భంగా మంత్రి సురేష్ నిరసన తెలుపుతుంటే.. తెదేపా వర్గీయులు దాడి చేసి ఆయన చొక్కా చించారు. అంత జ్ఞానమూ, చదువూ ఉన్న సురేష్ తానే స్వయంగా ఎందుకు చొక్కా విప్పుకొంటారు' అని విలేకరులకు ఎదురు ప్రశ్న వేశారు. చంద్రబాబు పర్యటనలో మంత్రి సురేష్ తనంతట తానే చొక్కా విప్పి, నినదించడం అన్ని ప్రసార మాధ్యమాల్లో వచ్చింది. దానిపై సహచర మంత్రి చెప్పిన తాజా భాష్యం.. చర్చనీయాంశమైంది.

# 2019లో హిస్టరీ క్రియేట్ చేశాం.. 2024లో రిపీట్ చేస్తాం

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



అనంతపురం: కార్పొరేట్ విద్యను కామన్ మెన్ కాళ్ల దగ్గరకు తీసుకువచ్చిన చరిత్రకారుడు సీఎం వైయస్ జగన్ అని, కేవలం పేద పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో అనేక పథకాలు, నాణ్యమైన చదువు కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారని శింగనమల నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. జగనన్న పాలనలో పేదవారి చదువుకు ధోకా లేదని, ఉన్నత విద్య డబ్బున్నవారికే కాదు.. అర్హత ఉన్న ప్రతి పేదవాడూ పొందే అవకాశం దక్కిందన్నారు. అభివృద్ధి అంటే ఎత్తైన బిల్డింగ్‌లు కాదు.. పేద ప్రజల కళ్లలో ఆనందం చూడటం అని చాటిచెప్పిన సీఎం వైయస్ జగన్‌కు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం నార్పలలో ఏర్పాటు చేసిన జగనన్న వసతి దీవెన నిధుల విడుదల బహిరంగ సభలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొని మాట్లాడారు.

**ఎమ్మెల్యే పద్మావతి ఇంకా ఏం మాట్లాడారంటే..** ప్రపంచాన్ని మార్చాలంటే చదువు ఒక్కటే ఆయుధమని నెల్సన్ మండేలా అన్నారు.. సీఎం వైయస్ జగన్ కూడా అదే ఆలోచనతో మన రాష్ట్ర స్థితిగతులను మార్చేలా విద్యారంగంలో అనేక వినూత్న మార్పులు తీసుకువచ్చారు. పేద విద్యార్థి ఉన్నత విద్యను పొందాలంటే ఎన్ని కష్టాలు పడాలో ప్రతి తల్లికీ తెలుసు. మా బిడ్డలు ఉన్నత చదువులు చదవాలనే కోరిక ప్రతి తల్లిదండ్రులకు ఉ ఒటుంది. సరస్వతి కటాక్షం ఎంతున్నా.. లక్ష్మీ కటాక్షం లేకపోతే చదువుకోలేని పరిస్థితి. కానీ, జగనన్న పాలనలో పేదవారి చదువుకు ధోకా లేదు. ఉన్నత విద్య డబ్బున్నవారికే కాదు.. అర్హత ఉన్న ప్రతి పేదవాడూ పొందే అవకాశం దక్కింది. కార్పొరేట్ విద్యను కామన్ మెన్ కాళ్ల దగ్గరకు తీసుకువచ్చిన చరిత్రకారుడు సీఎం వైయస్ జగన్. కేవలం పేద పిల్లలు చదువుకోవాలనే ఉద్దేశంతో అనేక పథకాలు, నాణ్యమైన చదువు కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. అందులో భాగమే వైయస్ఆర్ ప్రీప్రైమరీ స్కూల్స్, జగనన్న అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం, మనబడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, స్కూల్స్‌లో స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్స్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ప్రతి ఏటా 8వ తరగతి పిల్లలకు ఉచిత ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్‌తో సహా జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన వంటి అద్భుతమైన పథకాలు రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేస్తూ కేవలం విద్యారంగంపైనే కేవలం ఈ నాలుగేళ్లలో దాదాపు రూ.60 వేల కోట్లు ఖర్చు చేశారు. గతంలో శింగనమల నియోజకవర్గంలో కరువు కోరలు చాచి, నేలలు బీటలు బారి, చెరువులు ఎండిపోయిన పరిస్థితులు చూశాం. అలాంటిది జగనన్న నాయకత్వంలో మనందరి ప్రభుత్వం ఏర్పడ్డాక శింగనమల నియోజకవర్గంలో సమృద్ధిగా వర్షాలతో చెరువులు నిండి పచ్చటి పైర్లతో, ఆర్బీకేల ద్వారా రైతులకు అందించే సహాయ సహకారాలతో, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటుతో లాభసాటి వ్యవసాయాన్ని చూస్తున్నాం. ఇవన్నీ కేవలం నాలుగేళ్ల పాలన సాధ్యం చేశారు. అభివృద్ధి అంటే ఎత్తైన బిల్డింగ్‌లలో కాదు.. పేద ప్రజల కళ్లలో ఆనందం చూడటం అని చాటిచెప్పిన సీఎం వైయస్ జగన్‌కు కృతజ్ఞతలు. ఈ నాలుగేళ్లలో ఒక్క శింగనమల నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా రూ.1400 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పిస్తూ మహిళల అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం వైయస్ జగన్‌కు ధన్యవాదాలు. రూ.320 కోట్ల నిధులు మంజూరు చేసి శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన సీఎం వైయస్ జగన్ కృతజ్ఞతలు. శింగనమలలో ఇటీవల జరిగిన లోకేష్ పాదయాత్రను టీడీపీ వాళ్లు యువగళం అంటుంటే.. చూసిన జనం గందరగోళం అంటున్నారు. నా మెజార్టీ 46,377 ఓట్లు. నాకొచ్చిన ఓట్లు 1,18,662. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న నీ బాబు చంద్రబాబుకు కూడా ఎప్పుడూ ఇన్నీ ఓట్లు రాలేదు. జగనన్న బొమ్మ పెట్టుకొని అత్యధిక మెజార్టీతో గెలిచాను. ఓ వైపు బాబు, మరోవైపు కొడుకు ఇద్దరూ సెల్ఫీ ఛాలెంజ్‌లు చేస్తున్నారు. అది సెల్ఫీ ఛాలెంజ్‌లు కాదు.. వారి చేతగాని సెల్ఫ్ గోల్ ఛాలెంజ్‌లు. వారి ప్రభుత్వంలో ఆగిపోయిన పనులను కూడా సెల్ఫీలు తీసుకొని గోల్డ్ మెడల్ సాధించినట్టుగా చెప్పుకుంటున్నారు. శింగనమల ప్రజల తరఫున లోకేష్‌ను అడుగుతున్నా.. నీకు మా ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కనబడలేదా..? గార్లదిన్నె నుంచి శింగనమల వరకు వచ్చిన నువ్వు ప్రభుత్వం వేసిన రోడ్డు గమనించలేదా..? అక్కడెందుకు సెల్ఫీ తీసుకోలేదు. నాలుగేళ్లుగా నిండుకుండలా ఉన్న శింగనమల చెరువు పక్కన సెల్ఫీ ఎందుకు తీసుకోలేదు..? చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కుతంత్రాలు పన్నినా, ఎంత మీడియా గేమ్ ఆడినా జగనన్న వెంట జనం ఉన్నారు. ఆ జనం రాబోయే ఎన్నికల్లో జగనన్నే గెలిపిస్తారు. జగనన్న నెక్ట్స్ ఎన్నికల కోసం ఆలోచించే రాజకీయ నాయకుడు కాదు.. నెక్ట్స్ జనరేషన్ కోసం ఆలోచించే ప్రజా నాయకుడు. గత ఎన్నికల్లో ఏం చేస్తామో చెబితేనే ప్రజలు 151 సీట్లు ఇచ్చి ఆశీర్వదించారు. ఇప్పుడు గడప గడపకూ వెళ్లి ఏం చేశామో చెప్పి ప్రజల ఆశీర్వాదం కోరుతున్నాం. అందుకే మళ్లీ చెబుతున్నాం వై నాట్ 175. మీరెంత మంది వచ్చినా, ముసుగు వేసుకొని వచ్చినా, ముసుగు తీసి వచ్చినా డోంట్ కేర్.. సింహం సింగిల్‌గానే వస్తుంది. 2019లో హిస్టరీ క్రియేట్ చేశాం.. 2024లో హిస్టరీ రిపీట్ చేస్తాం.

# జగన్‌కు నైతిక విలువల గురించి మాట్లాడే హక్కు లేదు..




విజయవాడ: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్‌కు నైతిక విలువల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. అమ్మకి అన్నం పెట్టనోడు... చిన్నమ్మ చేతికి బంగారు గాజులు చేయించిన సామెతేలా ముఖ్యమంత్రి పరిస్థితి ఉందన్నారు. అరెస్టయి జైలులో ఉంటే షర్మిలను జగన్ పరామర్శించలేదని, సొంత తల్లిని, చెల్లిని పట్టించుకోని వ్యక్తి అని విమర్శించారు. సొంత తోడబుట్టిన సోదరి షర్మిలను పట్టించుకోని జగన్... రాష్ట్ర ఆడపడుచులకు అన్నగా ఉంటాననడం హాస్యాస్పదంగా ఉందని బుద్దా వెంకన్న అన్నారు. మరో చిన్నాన్న వివేకా కూతురు సునీతపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా ట్రోల్ చేస్తుంటే జగన్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో చంద్రబాబుపై చేసిన తప్పుడు ఆరోపణలు, జగన్ రిప్రజెంటేషన్‌పై సీఐడీ అధికారులు సీఎంను విచారించాలని డిమాండ్ చేశారు. గతంలో షర్మిల అరెస్టుపై ప్రధాని మోదీ ట్వీట్ చేశారని, కనీసం ముఖ్యమంత్రి సోదరి షర్మిలను, తల్లి విజయమ్మ, ఆమె కుటుంబాన్ని ఫోన్‌లో కూడా పరామర్శించలేదని బుద్దా వెంకన్న విమర్శించారు. జగన్ కోసం షర్మిల రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించారని అన్నారు. వివేకా హత్య కేసులో చట్టం తనపని తాను చేసుకుంటోందని మంత్రులు మాట్లాడుతున్నారని.. అంటే దానర్థం జగన్ ఎపుడు అరెస్ట్ అవుతారా? అని మంత్రులు ఎదురు చూస్తున్నారని అన్నారు. బొత్స సత్యనారాయణ అసెంబ్లీలో విజయమ్మను అవమానించారని, అయినా ఆయనను జగన్ మంత్రిగా పక్కన పెట్టుకున్నారన్నారు. జగన్.. తన తండ్రి రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు, సిద్ధాంతాలకు వ్యతిరేకి అని విమర్శించారు. సీబీఐ కూడా సీఐడీ లా సీఎం జగన్ చేతుల్లో ఉంటే ఈపాటికే వివేకా కూతురు సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డిని అరెస్టు చేయించేవారని బుద్దా వెంకన్న అన్నారు.

# పెన్నా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు: సీఎస్‌కు చంద్రబాబు లేఖ



అమరావతి: అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలంటూ సీఎస్ జవహర్ రెడ్డికి తెదేపా అధినేత చంద్రబాబు లేఖ రాశారు. వైకాపా నాయకులతో అధికారులు కుమ్మక్కై పెన్నా నదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వేస్తున్నారని లేఖలో ఆయన ఆరోపించారు. పెద్దపప్పూరు అక్రమ తవ్వకాలపై హైకోర్టులో విచారణ జరిగిందని గుర్తు చేశారు. "అడ్డగోలు తవ్వకాలతో పర్యావరణానికి నష్టం జరుగుతుంది. ఎన్జీటీతోపాటు కోర్టుల నుంచి ఆదేశాలు ఉన్నా అక్రమ తవ్వకాలను అరికట్టడంలో ప్రభుత్వ శాఖలు, అధికారులు విఫలమయ్యారు. పరిస్థితి చేయిదాటి పోకముందే సహజ వనరులను కాపాడుకోవాలి" అని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు.

# సోఫాలో రసగుల్ల ఇలా కోలుకుందో లేదో కానీ..!

యాక్సిడెంట్ లో చేయి విరగ్గొట్టుకుని నభానటేష్ తీవ్రంగా ఇబ్బందికి గురైన సంగతి తెలిసిందే. ప్రమాదంలో శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. అయితే ఎముకలు విరిగాక నొప్పి భరించలేనంతగా ఉందని నభా బాధను వ్యక్తం చేసింది. దీనికి శస్త్ర చికిత్స జరిగింది. కొంతకాలం పాటు పరిశ్రమకు దూరంగా ఉండాల్సి వస్తున్నందుకు చాలా ఆవేదనగా ఉన్నానని నభా తెలిపింది. అయితే ఎట్టకేలకు అన్ని గాయాల నుంచి కోలుకుని తిరిగి యాక్టివ్ అయినట్టే కనిపిస్తోంది. నెమ్మదిగా కోలుకుని తిరిగి తనదైన ఎనర్జీని పుంజుకుంటోంది ఈ ఇస్మార్ట్ భామ. ఇంతలోనే తనదైన శైలిలో



అద్భుతమైన ఫోటోషూట్ తో నభా నటేష్ వెబ్ లోకి దూసుకొచ్చింది. చినుగుల డెనిమ్ ఫ్యాంట్ .. కాంబినేషన్ గా చారల చొక్కాలో నభా సరికొత్తగా కనిపించింది. ఇక బటన్ లెస్ షర్ట్ లో నభా అందాల హిందోళం యూత్ లో కిక్కు పెంచింది. టూమచ్ గా చినిగిన బ్లూ జీన్స్ నభా పోష్ లుక్ ని ఎలివేట్ చేస్తోంది. చేతిలో కప్పు కాఫీతో అలా కురులను సరి చేసుకుంటూ కనిపించింది. వాస్తవానికి ముందు మీ కాఫీని తాగండి..!! అంటూ ఈ ఫోటోలను షేర్ చేసింది.

నభా నటేష్ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ విజయంలో నభా కీరోల్ గురించి తెలిసినదే. రామ్ పెర్ఫామెన్స్ కి ధీటుగా మాస్ పెర్ఫామెన్స్ తో కట్టి పడేసింది. కోస్టార్ నిధి కంటే నభాకి ఎక్కువ మార్కులు పడ్డాయి. ఆ తర్వాత ఈ బ్యూటీ డిస్కోరాజా, అల్లుడు అదుర్స్, మాస్ట్రో, చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది.

అన్ని పెద్ద ప్రాజెక్ట్ లే. కానీ వైఫల్యాలు ఎదురయ్యాయి. ఇక ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఈ బ్యూటీ పారితోషికం భారీగా పెంచేసిందని గుసగుసలు వినిపించాయి. నభా తదుపరి సినిమాల గురించి అప్ డేట్ తెలియాల్సి ఉంది.

# కిల్లర్ లుక్ లో రష్మిక కిల్ చేస్తోందే!

కూర్గ్ బ్యూటీ రష్మి మందన్న సారీ లుక్ ఒకటి ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ గా మారిన సంగతి తెలిసిందే. ఫోటో పాతదే అయినా అందులో బ్యూటీ ఒంపు సొంపులకు ఎవరైనా ఫ్లాట్ పోవాల్సిందే. నలుపు సారీలో కెమెరాకి ఇచ్చిన ఫోజులు మరోసారి నెట్టింట మరోసారి చర్చనీయాంశగా మారింది. అందులోనూ సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతోంది. నల్ల చీర రైక మ్యాచింగ్ బ్లౌజ్ ధరించిన రష్మిక కెమెరాకి వలపు యాంగిల్ లో ఫోజులు ఇచ్చింది. తలకాయని కాస్త క్రిందకి దించి..రెండు చేతులు తలపై జుట్టు మధ్యలోకి చేర్చి తనలో విరహవేదన మనోహరిని తట్టి లేపింది. మునుపెన్నడు చూడని సరికొత్త రష్మికని ఆవిష్కరించింది. రష్మిక నల్లటి చీర ధరించడమే ఓ సంచలనమైతే...ఆ నలుపు వర్ణంలో మనోహరిలా మరింత అందంగా ఎలివేట్ అవుతోంది. ఎడమ చేతి వేలికి గ్రీన్ కలర్ పొడితో కూడిన రింగ్..కుడిచేతికి ధరించిన గాజులు సమ్ థింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రష్మిక భిమానులు ఓ రేంజ్ లో షేర్ చేస్తున్నారు. ఇక రష్మిక సినిమాల విషయానికి వస్తే పుష్ప లో శ్రీవల్లి పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాకి మరింత దగ్గరైంది. నటిగా



తనలో కొత్త కోణాన్ని వెండి తెరపై ఆవిష్కరించిన తీరుకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. శ్రీవల్లి పాత్రతో కొన్నాళ్ల పాటు ప్రేక్షకులకు గుర్తిండిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. రష్మిక లో సిసలైన నటిని క్రియేటివ్ మేకర్ సుకుమార్ పైకి తీసుకొచ్చారు. బాలీవుడ్ లో స్థిరపడాలనుకుంటోన్న రష్మికకు శ్రీ వల్లి పాత్ర మంచి బూస్టింగ్ ఇస్తుంది. జాతీయ స్థాయిలో బాగా పాపులర్ అయింది. మొదటి భాగం పెద్ద సక్సెస్ అయిన నేపథ్యంలో రెండవ భాగం పుష్ప ది రూల్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి.పుష్ప 2 ప్రీప్రొడక్షన్ వేగంగా పూర్తవుతోంది. దర్శకుడు సుకుమార్ సహా ప్రధాన సాంకేతిక నిపుణులు.. టీమ్ లోని నటీనటులతో పాటు అల్లు అర్జున్ మీటింగ్ ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో చాలా అంశాలు చర్చకు వచ్చాయి. తొలిగా బన్ని తాము అందుకున్న ఫలితంపై తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. అయితే ఈ సంవత్సరం డిసెంబర్ నాటికి సినిమా పార్ట్ 2 ని తెరపైకి తేగలమా? లేదా? అన్న తర్జన భర్జన సాగుతోంది. ఇక బాలీవుడ్ లో రష్మిక బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తోంది. మిషన్ మజ్ను..– గుడ్ బై చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలపై అమ్మడు చాలా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఆ చిత్రాల షూటింగ్ కూడా పూర్తయింది. త్వరలోనే ఆ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. బాలీవుడ్ లో అవకాశాలు వస్తే అక్కడే స్థిరపడిపోవాలని ప్లాన్ చేసుకుంటోంది రష్మిక.




# ఒక్క సాలిడ్ హిట్ కూడా లేని అషురెడ్డి ఇన్ని దేశాలు ఎలా తిరిగేస్తోందబ్బా?





బుల్లితెర మీద అషురెడ్డి చేసే సందడి అంతా ఇంతా కాదు. బిగ్ బాస్ ద్వారా బుల్లితెర ఎంట్రీ ఇచ్చిన ఆమె ఆ తర్వాత అనేక రకాల మాటీవీ షోలలో కనిపిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాస్త షోలలో కనిపించడం తగ్గించిన సోషల్ మీడియాలో మాత్రం రచ్చ చేస్తూ వస్తోంది. అషు రెడ్డి తల్లిదండ్రులు అమెరికాలో నివసిస్తారని సంగతి తెలిసిందే. అమెరికాలో కొన్నాళ్లు ఇండియాలో కొన్నాళ్ళు అన్నట్టుగా అషు రెడ్డి షెడ్యూల్ సర్వీస్ చేస్తోంది. అయితే నిజంగా అషురెడ్డి అంత రిచ్చా ఒకరోజు అమెరికాలో ఉన్నాను అని పోస్ట్ పెడుతుంది మరుసటి రోజు దుబాయ్ లో ఉన్నాను అని పోస్ట్ పెడుతుంది ఆ తర్వాత థాయిలాండ్ లో ఉన్నానని లేదా మాల్దీవులలో ఉన్నానని ఇలా రకరకాల పోస్టులు రకరకాల ప్రదేశాల నుంచి పెడుతూ ఉంటుంది. అయితే ఒక టీవీ నటి అది కూడా సినిమాలు చేసిన చిన్నా చేతగా సినిమాలు తప్ప పెద్ద సినిమా ఆఫర్ ఒక్కటి కూడా రాని నటి ఇంతలా ఎలా ఖర్చు పెడుతుంది. ఆమె ఆదాయం మార్గం ఏమిటి అని పెద్ద ఎత్తున ఇప్పుడు చర్చ జరుగుతోంది. వాస్తవానికి అషురెడ్డి చిన్నప్పుడే ఆమె తల్లిదండ్రులు విశాఖపట్నం నుంచి అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు అమెరికాలోని కొన్నాళ్లపాటు సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసిన అషు సినీ రంగం మీద ఉన్న మక్కువతో అప్పట్లో డబ్ స్మాష్ చేస్తూ జూనియర్ సమంత గా పేరు తెచ్చుకుంది. అలా ఒక సినిమా అవకాశం దక్కించుకుంది. సినిమా రంగంలో పరిచయాలు పెరిగిన తర్వాత కూడా కొన్నాళ్లు ఇక్కడ కొన్నాళ్ళు అమెరికాలో గడుపుతూ వస్తోంది. అయితే ఆమె ఇంతలా ఖర్చు పెట్టడానికి ఇన్ స్టాగ్రామ్ ద్వారా ఆదాయం వస్తుందని అంటున్నారు. ఎప్పటికప్పుడు ఇన్ స్టాగ్రామ్ ద్వారా హాట్ ఫోటోలు షేర్ చేస్తూ ఉండే ఈ భామ ఫాలోవర్లను పెంచుకుంటూ కొన్ని ప్రోడక్టను మార్కెటింగ్ చేస్తోందని ఆయా సంస్థలు రెమ్యూనరేషన్ కింద ఇచ్చే డబ్బుతోనే ఇంత హ్యాపీగా కావలసిన చోటికి తిరుగుతుందని తెలుస్తోంది.

# బాబోయ్... సమంత ఇప్పటి కంటే డబుల్ చేయనుందట!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఈ మధ్య కాలంలో రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తోంది. ఆమె హాట్ ఫోటోలు.. వాటికి అభిమానులు చేసే కామెంట్స్ వల్ల వార్తల్లో ఉంటోంది. కొన్ని సార్లు ఆ కామెంట్ కి ఆమె సీరియస్ గా స్పందించడం వల్ల కూడా ఆమెను వార్తల్లో నిలుస్తోంది. ముఖ్యంగా ఆమె ఈ మధ్య కాలంలో సమంత వర్కౌట్లు చేస్తూ ఫిజిక్ పై దృష్టి పెట్టి షేర్ చేస్తున్న వీడియో లు మరియు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ప్రతి రోజూ గంటల తరబడి వర్కౌట్లు చేస్తూ గడిపే సమంత తన వర్కౌట్ టైం డబల్ చేయబోతున్నట్లుగా తెలుస్తోంది. అంతే కాకుండా ఇప్పటి వరకు పడుతున్న కష్టం కు డబల్ కష్టపడబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. అందుకు కారణం ఆమె త్వరలో హిందీలో చేయబోతున్న ఒక వెబ్ సిరీస్. బాలీవుడ్ వర్గాల ద్వారా అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం ది ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ దర్శక ద్వయం తెరకెక్కించబోతున్న ఒక భారీ వెబ్ సిరీస్ లో సమంత కీలక పాత్రలో కనిపించబోతుంది. ఆ పాత్రకు సంబంధించిన విషయాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా ఉన్నాయి. హాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్ కి రీమేక్ అని తెలుస్తుంది. ఆ వెబ్ సిరీస్ లో యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది. ది ఫ్యామిలీ మాన్ సీజన్ 2 వెబ్ సిరీస్ కోసం సమంత పడ్డ కష్టం గురించి ప్రతి ఒక్కరికి తెలిసిందే. నెగటివ్ షేడ్స్ తో పాటు బోల్డ్ సన్నివేశాల్లో నటించడంతో పాటు యాక్షన్ సన్నివేశాల్లో కూడా నటించి మెప్పించింది. నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించి మెప్పించడం అంటే మామూలు విషయం కాదు. ఇప్పుడు సమంత ను లీడ్ రోల్ లో చూపిస్తూ ఈ వెబ్ సిరీస్ ని దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం ప్రకారం ఈ ఏడాది ద్వితీయార్ధం లో షూటింగ్ కార్యక్రమాలు మొదలు కాబోతున్నాయి. వెబ్ సిరీస్ లో సామ్ ఫిజిక్ మరియు యాక్షన్ సన్నివేశాల ప్రతిభ కీలకంగా ఉంటుందట. అందుకే యాక్షన్ సన్నివేశాల కోసం ట్రైనింగ్ తీసుకోబోతున్నట్లు గా తెలుస్తోంది. అందుకోసం ముంబైలో ఆమె చాలా రోజుల పాటు ఉండబోతుంది. యాక్షన్ సన్నివేశాల కోసం వర్క్ షాప్ లో సమంత పాల్గొని ఇప్పటి వరకు చేసిన వర్కౌట్ కి డబుల్ చేసి యాక్షన్ సన్నివేశాలకు రెడీ అవుతోంది. ఇక సమంత ఇతర సినిమాల విషయానికి వస్తే తెలుగులో ఈమె చేసినా శాకుంతలం త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమా నుండి ఇటీవలే ఫస్ట్ లుక్ వచ్చింది. అందులో సామ్ చాలా అందంగా కనిపించి ఆకట్టుకుంది. మరోవైపు యశోద అనే భారీ పాన్ ఇండియా సినిమా లో కూడా సామ్ చేస్తోంది. ఇవి కాకుండా హిందీలో రెండు సినిమా లు చేయబోతున్నట్లుగా వార్తలు మొదలయ్యాయి. మొత్తానికి సమంత ఫుల్ బిజీగా ఉన్నా కూడా యాక్షన్ సన్నివేశాల కోసం వర్క్ షాప్ కు హాజరు అవ్వడం అంటే కచ్చితంగా ఆమె వర్క్ డెడికేషన్ కి అభినందనలు తెలియజేయాల్సిందే అంటూ కామెంట్స్ వస్తున్నాయి.

# పుష్పరాజ్ ని శ్రీదేవి తనయ అలా అనేసిందేమిటీ?

పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా..ఫైర్! అన్న డైలాగ్ థియేటర్లో ఎలా పేలింతో చెప్పాల్సిన పనిలేదు. టైటిల్ కి పర్ ఫెక్ట్ జస్ట్ ఫికేషన్ అది. తగ్గేదేలే!! అన్న డైలాగ్ తోనే పుష్ప రాజ్ పాత్రని సుకుమార్ ఎంత పవర్ ఫుల్ గా డిజైన్ చేసారో అర్థమవుతుంది. పుష్పరాజ్ యాటిట్యూడ్ ప్రవర్తనా విధానం ఎలాంటిదో ఆ డైలాగ్ తోనే ముగింపు వరకూ వినిపిస్తూనే ఉంటుంది. సినిమాకి రివ్యూల పరంగా ప్రతికూలంగా అనిపించినా బాక్సాఫీస్ వద్ద మాత్రం వసూళ్ల సునామీనే సృష్టించింది. ఉత్తరాదిన రిలీజ్ అయిన రెండు రోజుల పాటు జనాలు థియేటర్ వైపు చూసింది లేదు గానీ..అటుపై వచ్చిన మౌత్ టాక్ తో ఒక్కసారిగా సినిమా అలా పైకి లేచింది. ఇప్పుడు ఓటీటీలోకి కూడా అందుబాటులోకి రావడంతో పుష్ప రాజ్ కి బాలీవుడ్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఇప్పటికే ఈ చిత్రాన్ని వీక్షించి బన్నీపైనా కంటెంట్ పైనా ప్రశంసలు



కురిపించారు. తాజాగా అతిలోక సుందరి శ్రీదేవి స్వీట్ డాటర్ జాన్వీ కపూర్ కూడా పుష్పని పొగడ్తలతో ముంచెత్తకుండా ఉండలేకపోయింది. అందరికన్నా పుష్ప రాజ్ కి ది బెస్ట్ కాంప్లిమెంట్ ఇచ్చేసింది. ఇన్ స్టా వేదికగా జాన్వీ తన అభిప్రాయాన్ని తెలిపింది. పుష్ప మాస్ గెటప్ ని షేర్ చేస్తూ.. ది కూలెస్ట్ మేన్ ఇన్ ది వరల్డ్ అని క్యాప్షన్ ఇచ్చింది. మైండ్ బ్లోయింగ్ అని కూడా రాసికొచ్చింది. ఈ పోస్ట్ ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఐకాన్ స్టార్ ని ఉద్దేశించి ఇప్పటివరకూ ఏ హీరోయిన్ ఈ రేంజ్ లో కామెంట్ చేసింది లేదు. మరి కూలెస్ట్ మ్యాన్ అని పుష్పరాజ్ పాత్రలో కోణాన్ని ఉద్దేశించి ఇలా కామెంట్ చేసింది. పుష్పరాజ్ ఇందులో బీడి తాగుతూ కూల్ గా ఉంటాడు. తను ఎవరి జోలికి పోడు..ఎవరైనా తన జోలికి వస్తే ఊరుకోని నైజం. గంధపు దుంగల వ్యాపారంలోకి దిగిన తర్వాత టెన్షన్లు ఉంటాయి. పుష్పరాజ్ అంతకుముందు వరకూ జాన్వీ చెప్పినట్లు కూల్ గయ్ నే కదా. తెలివిగా స్కెచ్ లు వేస్తూ రాజకీయం నడిపించేవాడిగానూ పుష్ప లో యాంగిల్ ఆకట్టుకుంటుంది. ఎర్రచందనం మాఫియా కు డాన్ అయ్యాడంటే.. శ్రీవల్లితో పబ్లిగ్గానే రొమాన్స్ చేశాడంటే.. ఆషామాషీ వ్యవహారమా? అందుకే కూల్ మ్యాన్ అంటూ పుష్పరాజ్ ని జాన్వీ పొగిడేసిందన్నమాట. ఇకపోతే తెలుగులో నటిస్తే విజయ్ దేవరకొండతో పాటు అల్లు అర్జున్ సరసన కూడా అవకాశం వస్తే మిస్ చేసుకోదనడానికి ఇది సింబాలిక్ అని భావించాల్సి ఉంటుంది. బన్ని సరసన జాన్వీ అంటూ ఇంతకుముందు కథనాలు కూడా వైరల్ అయిన సంగతి విధితమే.

# వరుస ఫ్లాప్స్ పడ్డా ఈమె మోస్ట్ వాంటెడ్

తమిళ ముద్దుగుమ్మ కీర్తి సురేష్ మహానటి సినిమా తర్వాత పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఆ సినిమా లో నటిగా అద్భుతమైన ప్రతిభతో సావిత్రిని గుర్తుకు తీసుకు వచ్చిందంటూ కామెంట్స్ దక్కించుకుంది. ఆ తర్వాత నుండి ఇప్పటి వరకు కీర్తి సురేష్ ఆ స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేక పోయింది. ముఖ్యంగా లేడీ ఓరియంటెడ్ చిత్రాలు బ్యాక్ టు బ్యాక్ చేసి నిరాశే చవి చూసింది. ప్రేక్షకులు అభిమానులు ఈమె లేడీ ఓరియంటెడ్ చిత్రాల విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మొన్నటికి మొన్న విడుదల అయిన గుడ్ లక్ సఖి కూడా ఆమె లక్ ను మార్చడం లో విఫలం అయ్యింది. దాంతో వరుసగా ఫ్లాప్స్ పడుతుండటంతో హీరోయిన్ గా సినిమాల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగుతుంది. లేడీ ఓరియంటెడ్ సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ కమర్షియల్ సినిమాలు చేసేందుకు



సిద్ధం అవుతోంది. సహజంగా అయితే ఇన్ని ఫ్లాప్ లు చవి చూసిన ఈ అమ్మడికి ఆఫర్లు రావడమే గగనం. కాని కీర్తి సురేష్ కు మాత్రం స్టార్స్.. సూపర్ స్టార్స్ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటూ ఉంది. రజినీకాంత్ తో పాటు పలు తమిళ స్టార్ హీరోల సినిమాల్లో ఇప్పటికే నటించిన ఈ అమ్మడు ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో నటిస్తున్న విషయం తెల్సిందే. మహేష్ బాబు.. కీర్తి సురేష్ జంటగా రూపొందుతున్న సర్కారు వారి పాట సినిమా షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఇదే సమయంలో చిరంజీవి సినిమా భోళాశంకర్ సినిమాలో కూడా కీర్తి సురేష్ కీలక పాత్రలో కనిపించబోతుంది. ఇవి మాత్రమే కాకుండా కీర్తి సురేష్ కు హిందీ సినిమా ల్లో కూడా ఆఫర్లు వస్తున్నాయనే వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం తమిళ మరియు తెలుగు సినిమా లపై ఎక్కువ దృష్టి పెడుతున్నట్లుగా చెప్పుకొచ్చిన ఈ అమ్మడు ముందు ముందు బాలీవుడ్ ఎంట్రీ గురించి ఆలోచిస్తానంటూ ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. వరుస ఫ్లాప్ లు పడ్డా కూడా ఈ స్థాయిలో ఆఫర్ లు రావడం అంటే ఖచ్చితంగా అదృష్టంగానే చెప్పాలి. ఎంతటి స్టార్ హీరోయిన్ అయినా కూడా వరుసగా రెండు మూడు ఫ్లాప్ లు పడితే అవకాశాలు తగ్గే అవకాశం ఉంది. కాని కీర్తి సురేష్ కు మాత్రం అలా ఏమీ జరగడం లేదు. అనూహ్యంగా కీర్తి సురేష్ కి సినిమా సినిమా కు క్రేజ్ పెరుగుతూనే ఉంది. ఇకపై అయినా జాగ్రత్తగా సినిమాలను ప్లాన్ చేసుకోవాలని అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# రైతులు మనోధైర్యంతో ఉండాలి.. ప్రభుత్వం ఆదుకుంటుంది: మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట: వడగండ్ల వానతో నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి హరీశ్ రావు రైతులకు భరోసానిచ్చారు. రాత్రి కురిసిన అకాల వర్షాలకు సిద్దిపేట జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో సిద్దిపేట అర్బన్ మండలం నాంచారుపల్లి, బక్రిచెప్యాల గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి హరీశ్ రావు పర్యటించారు. వడగండ్ల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పంటనష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందిస్తామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. యుద్ధప్రాతిపదికన నష్టపోయిన ధాన్యం పంటల వివరాలు సేకరించాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు. వడగండ్ల వానతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. పంటనష్టం అంచనాలు వేయాలని అధికారులకు చెప్పామని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది ఉన్నప్పటికీ రైతులను ఆదుకుంటామని చెప్పారు. సిద్దిపేట జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని వెల్లడించారు. తినేముద్ద



జారిపడినట్లుగా రైతుల పరిస్థితి తయారైందన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దీనంగా ఉందని పేర్కొన్నారు. రైతులు మనోధైర్యంతో ఉండాలని, ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా మిర్‌దొడ్డి మండలంలో 10.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ధూల్‌మిట్టలో 7.8 సెంటీమీటర్లు, కొండపాకలో 6.68, అక్కన్నపేటలో 5.6, దౌలతాబాద్‌లో 5.4, మద్దూరులో 5.44, సిద్దిపేట రూరల్‌లో 2, నాగన్‌పూర్‌లో 2.2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయింది.

# ఆందోళన వద్దు.. ఇది రైతుల విషయంలో అత్యంత సానుకూలంగా ఉండే ప్రభుత్వం: మంత్రి కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే. తారకరామారావు తెలిపారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల వలన రైతులకు ఎదురవుతున్న ఇబ్బందుల పట్ల ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కష్టకాలంలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులంతా రైతులకు భరోసా ఇవ్వాలన్నారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రతినిధులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని కోరారు. రాష్ట్రంలోని రైతులు ఆందోళన చెందవద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు.

ఇటీవల కురిసిన ఆకాల వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు భరోసా ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. రైతుల విషయంలో అత్యంత సానుకూలంగా ఉండే ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని చెప్పారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని, వారికి అండగా సీఎం కేసీఆర్ ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. రానున్న ఒకటి, రెండు రోజులపాటు భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అధికార యంత్రంగానికి మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

**సిరిసిల్ల జిల్లాలో పరిస్థితులపై సమీక్ష :** మంగళవారం సాయంత్రం నుంచి కురుస్తున్న అకాల వర్షాలపై మంత్రి కేటీఆర్ సిరిసిల్ల జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ, వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

జిల్లాలోని పరిస్థితులపై వివరాలు తీసుకున్నారు. అనుకోకుండా కురిసిన ఈ అకాల వర్షాల వలన నష్టపోయిన జిల్లా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు అందోళన చెందవద్దని కోరారు. జిల్లా అధికారులతోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు ప్రతి ఒక్కరు తమ పరిధిలోని ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు భరోసా ఇవ్వాలని సూచించారు.

# అయ్య ఔరంగాబాద్‌లో.. కొడుకు ప్లీనరీల పేరుతో ఊరేగుతున్నారు

హైదరాబాద్ : టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ట్విటర్ వేదికగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై విరుచుకుపడ్డారు. అకాల వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడిసి రైతులు కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంటే.. అయ్య ఔరంగాబాద్‌లో.. కొడుకు ప్లీనరీల పేరుతో.. రాజకీయ సభలు పెట్టుకుని ఊరేగుతున్నారని విమర్శించారు. వీళ్లకు మానవత్వం ఉందా? అని రేవంత్ ప్రశ్నించారు. బాధ్యత ఉందా... ఇది ప్రభుత్వమేనా? అని నిలదీశారు. రైతు – యువత ఏకమై బీఆర్ఎస్‌ను బొందపెట్టే సమయం వస్తుందని రేవంత్ అన్నారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పెద్ద ఎత్తున సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. దీనిని విమర్శిస్తూ రేవంత్ ట్వీట్ చేశారు.



# గజ్వేల్‌లో సాగునీటి కోసం రైతుల మెరుపు సమ్మె




మెదక్: ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో రైతులు రోడ్డెక్కారు. కొండపాక మండలం, వెలుకట్ట చౌరస్తావద్ద సాగునీటి రైతులు ధర్నా చేపట్టారు. రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బంధారం, బంధారం దర్గా, అక్కిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులు బుద్దేడువద్ద ఆందోళన నిర్వహించారు. తపస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీరు అందిస్తామని ప్రభుత్వం ఇస్తున్న హామీ.. ఇంత వరకు అమలు కాలేదని రైతులు ఆరోపించారు.

మల్లన్నసాగర్ నుంచి నీరు అందిస్తామని ఎన్నోసార్లు చెప్పారని, కానీ కాలువ నిర్మాణం కూడా చేపట్టలేదని అన్నారు. రైతుల మెరుపు సమ్మెతో పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. రైతులను ఎక్కడికక్కడ అడ్డుకుని మందుగానే అదుపులోకి తీసుకున్నారు. దీంతో రైతుల అరెస్టును నిరసిస్తూ పలువురు రైతులు మూడవ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. రైతులు ధర్నా చేస్తుండగా.. అధికార పార్టీ నేతలు గజ్వేలులో ప్లీనరీ సందర్భంగా జండా ఎగురవేశారే తప్పా.. రైతుల సమస్యలు తెలుసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సూడాన్‌లో చిక్కుకున్న తెలంగాణ వారిపై బీఆర్ఎస్ సర్కార్ దృష్టి

న్యూఢిల్లీ: సూడాన్‌లో సైన్యానికి, పారా మిలిటరీ దళాలకు జరుగుతున్న అంతర్యుద్ధంలో చిక్కుకున్న భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కావేరి' పేరుతో సహాయక చర్యలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. సూడాన్ నుంచి పౌరులను తరలించేందుకు ఆపరేషన్ కావేరి ముమ్మరంగా సాగుతోంది. అందులో భాగంగా సూడాన్‌లో చిక్కుకున్న తెలంగాణ వారిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఆపరేషన్ కావేరిలో భాగంగా భారత్ తిరిగి వస్తున్న వారిలో తెలంగాణ ప్రజలు ఉంటే వారికి సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. తెలంగాణ ప్రజలను స్వరాష్ట్రాలకు తరలించేందుకు బీఆర్ఎస్ సర్కార్ చర్యలు చేపట్టింది. ఢిల్లీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీ తెలంగాణ భవన్‌లో అధికారులతో తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ.. సూడాన్ పరిస్థితులపై విదేశీ వ్యవహారాల శాఖ రాష్ట్రాలకు బ్రీఫింగ్ ఇచ్చిందన్నారు. సూడాన్ నుంచి భారత పౌరులను తీసుకు వచ్చేందుకు ఆపరేషన్ కావేరి ప్రారంభించారని తెలిపారు. సూడాన్‌లో ఉన్న తెలంగాణ ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ఢిల్లీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని... విదేశీ శాఖతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఢిల్లీకి చేరుకునే తెలంగాణ పౌరులను రిసీవ్ చేసుకొని, వాళ్ళకు ఢిల్లీలో ఏర్పాట్లు చేస్తామన్నారు. వారిని ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు పంపించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. సూడాన్ నుంచి తెలంగాణకు చెందిన నలుగురు వస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. మొత్తం సూడాన్‌లో ఎంత మంది తెలంగాణ వాళ్ళు ఉన్నారనేది ఇంకా విదేశాంగ శాఖ స్పష్టత ఇవ్వలేదని గౌరవ్ ఉప్పల్ వెల్లడించారు.




**తెలంగాణ సంగారెడ్డి జిల్లాలో పిల్లనిచ్చిన అత్తమామలనే చంపడానికి ప్రయత్నించాడో ఓ వక్తి. కరెంట్ షాక్ పెట్టి హత్య చేయాలని పక్కా ప్రణాళిక వేశాడు. కానీ అనుకున్నది ఒకటి.. అయినది మరొకటి. అత్తమామల్ని కాటికి పంపాలని కుట్ర చేసిన అల్లుడు.. చివరికి కటకటాల పాలయ్యాడు. ఎందుకీ హత్య చేయాలనుకున్నాడనే కోణంలో దర్యాప్తు చేసిన పోలీసులు.. కారణం తెలుసుకుని అవాక్కయ్యారు.**




సింగపూర్: గంజాయి అక్రమ రవాణా కేసులో భారత సంతతి వ్యక్తికి సింగపూర్ బుధవారం ఉరిశిక్ష అమలు చేసింది. మరణశిక్షను తగ్గించుకునేందుకు న్యాయపరంగా జరిగిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అతడు ఉరికంబం ఎక్కాల్సి వచ్చింది. ఈ శిక్షపై అంతర్జాతీయంగా వ్యతిరేకత వచ్చినప్పటికీ సింగపూర్ అతడిని శిక్షించింది. భారత సంతతికి చెందిన తంగరాజు సుప్పయ్య.. గంజాయి అక్రమ రవాణా కేసులో 2014లో అరెస్టయ్యాడు. ఒక కిలో గంజాయిని సింగపూర్‌కు అక్రమంగా తరలిస్తున్నాడన్న అభియోగాలు అతడిపై నమోదయ్యాయి. ఈ కేసులో అతడికి అక్టోబర్ 9, 2018లో మరణశిక్ష పడింది. మరో ఇద్దరితో కలిసి తంగరాజు మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సహకరించినట్లు నిర్ధారించిన న్యాయస్థానం.. అతడికి శిక్ష విధించింది. డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో భారత సంతతి వ్యక్తిని ఉరితీయడం ఇది రెండోసారి. ప్రమాణాలకు అనుగుణంగా తంగరాజు కేసు విచారణ జరగలేదని, ఓ అమాయకుడిని సింగపూర్ చంపబోతోందని ఇదివరకు తీవ్ర విమర్శలు వచ్చాయి.

ఈ శిక్షపై బ్రిటన్ బిలియనీర్ రిచర్డ్ బ్రాన్సన్ తీవ్రస్థాయి ఆరోపణలు చేశారు. యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియా ఆయనకు మద్దతుగా నిలిచాయి. కానీ బ్రాన్సన్ ప్రకటనను సింగపూర్ ఖండించింది. ఆయన వ్యాఖ్యలు సింగపూర్ న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులను కించపరిచేలా ఉన్నాయని మండిపడింది. మాదకద్రవ్యాలకు సంబంధించి స్థానిక చట్టాల ప్రకారమే అతడికి ఉరిశిక్ష అమలు చేస్తున్నామని సింగపూర్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# షర్మిల తెలంగాణ బిడ్డ.. టీ సేవ్ నిరాహార దీక్షలో గద్దర్

హైదరాబాద్: వైఎస్సార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల తెలుగు తల్లి, తెలంగాణ బిడ్డ అని ప్రజాయుద్ధ నౌక గద్దర్ అన్నారు. టీ సేవ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు దగ్గర ఏర్పాటు చేసిన నిరాహార దీక్ష గద్దర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుద్యోగులకు ఉద్యోగాలు అనే నినాదంతో షర్మిల తన పోరాటం మొదలు పెట్టారని తెలిపారు. మొన్నటి వరకు మంత్రులు ఎక్కడున్నారో ఎవరికి తెలియలేదని.. 30 నుంచి అందరూ మన ముందే ఉంటారన్నారు. లైబ్రరీలో పిల్లల మొహాలు వాడుతున్నాయని తెలిపారు. ఇంటికి పోలేక, ఇక్కడ తిండి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యువత శక్తిని ఇండియా వాడుకోలేకపోతోందని అన్నారు. "మై హోం" కి "నో హోం"కి ఉన్న తేడా గమనించాలన్నారు. తాను ఏ పార్టీ సభ్యుడిని కాదని స్పష్టం చేశారు. షర్మిల ఆత్మ రక్షణ కోసం డిఫెన్స్ చేసుకున్నారని ఆయన తెలిపారు. "గ్రామాలకు తరలండి... ఓట్ల యుద్దానికి సిద్దం కండి. ప్రతి ఇంటిని బూత్ కమిటీగా మార్చండి. డబ్బుతోనే అధికారం లోకి రావచ్చని కేసీఆర్ ఫిక్స్ అయ్యాడు.

కేసీఆర్ అధికారంలోకి వచ్చే సమయంలో ఆయన దగ్గర ఉద్యమాలు ఉన్నాయి. డబ్బులు లేవు. ఇప్పుడు కేసీఆర్ దగ్గర డబ్బులు ఉన్నాయి. మన దగ్గర ఉద్యమాలు ఉన్నాయి. విద్యార్థులు రాజకీయ శక్తిగా మారాలి. మనం పిల్లులతో కొట్లాడుతున్న ఎలుకలం" అంటూ



వ్యాఖ్యలు చేశారు. షర్మిల రాజకీయ శక్తిగా మారింది కాబట్టే ఆమెని ఇంటి నుంచి బయటకి రానివ్వడం లేదని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక కన్నీళ్లు తప్ప ఏం రాలేదన్నారు. కేసీఆర్ కూలిపోయేలా ప్రణాళికతో ముందుకు వెళ్లి ఆయన్ని కూలగొట్టాలని పిలుపునిచ్చారు. షర్మిల తెలంగాణ నాడి పట్టుకున్నారన్నారు. అసెంబ్లీనీ, సెక్రెటరేయెట్‌ను విద్యార్థులు చుట్టు ముట్టాలని పిలుపునిచ్చారు.కేసీఆర్ పతనమయ్యే దశ వచ్చిందని గద్దర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. టీ సేవ్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు దగ్గర జరుగుతున్న నిరాహార దీక్షలో వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల, పలు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సర్కార్ కళ్ళు తెరిపించేందుకే నిరుద్యోగుల కోసం కొట్లాట అనే నినాదంతో నిరాహార దీక్ష చేపట్టారు.

# జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో దంచికొట్టిన వాన..

జోగుళాంబ/వనపర్తి: ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో వాన దంచికొట్టింది. బుధవారం తెల్లవారుజామున ప్రారంభమైన ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ఉదయం 5 గంటలవరకు ఎడతెరపి లేకుండా కురిసింది. దీనికి ఈదురు గాలులు తోడవడంతో చేతికొచ్చిన పంట వర్షార్పణం అయింది. జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా బుధవారం తెలవారుజామున కురిసిన అకాల వర్షాలు బీభత్సం సృష్టించాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. చేతికొచ్చిన పంట వర్షంలో కొట్టుకుపోయింది. ఈదూరు గాలులకు వరి, మామిడి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో వాగులు పొంగిపొర్లాయి. పెద్దసంఖ్యలో చెట్లు నేలకొరిగాయి. వనపర్తి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం 3 గంటలకు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ప్రారంభమై.. ఉదయం 5 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో వనపర్తి పట్టణంతోపాటు పలు మండలాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. వనపర్తిలోని కాలనీల్లో రహదారుల పైకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వరి కోత





దశలో భారీ వర్షం పడటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు..




హైదరాబాద్: రాష్ట్రంలో మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్ , నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపుతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రేపు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో వానలు పడుతాయని, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. బుధవారం మధ్యాహ్నం తర్వాత ఉత్తర తెలంగాణలోని జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రైతులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కాగా, బుధవారం తెల్లవారుజామున జోగులాంబ గద్వాల జిల్లాలో భారీ వర్షం కురిసింది. ధరూర్ మండలం నీలహళ్లిలో పిడుగుపాటుకు రైతు నర్సింహులుకు చెందిన రెండు ఎద్దులు మృతిచెందాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం చేగుంటలో పిడుగుపడి ఓ రైతుకు చెందిన మూడు బర్రెలు మరణించాయి. తాడూరు మండలం సిరిసవాడలో పిడుగుపడి ఓ బర్రె మృతిచెందింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com